ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం · కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

గురువారం 22 అక్టోబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 184
Thursday 22 octobar 2026 | Vol.No 28 Issue No .184
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## కొండారెడ్డిపల్లి లో
# సీఎం రేవంత్ కు బ్రహ్మరథం
## ఆప్యాయంగా హత్తుకున్న సొంతూరి జనం

**సొంతగడ్డపై సీఎం రేవంత్ దసరా జాతర కొండారెడ్డిపల్లి నుండి కల్వకుర్తి వరకు జన ప్రభంజనం..!**

**ఆప్యాయంగా హత్తుకున్న కొండారెడ్డిపల్లి ప్రజలు చిన్ననాటి మిత్రులతో ఆత్మీయ కౌగిలి ఓపెన్ టాప్ జీపులో సీఎం రోడ్ షోతో పండుగకు పీక్స్ రాత్రి కల్వకుర్తిలో రావణ దహనం**

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 21, (విజన్ ఆంధ్ర) విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన స్వగ్రామమైన నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో నిర్వహించిన దసరా వేడుకలు అంగరంగ వైభవంగా, అత్యంత వైభవోపేతంగా జరిగాయి. సీఎం రాకతో కొండారెడ్డిపల్లి గ్రామం మొత్తం పండుగ శోభతో, పసుపు కుంకుమలతో, బంతి పూలతో, మామిడి తోరణాలతో కళకళలాడింది. మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు కొండారెడ్డిపల్లి నుండి కల్వకుర్తి వరకు సీఎం పర్యటన జనసంద్రం మధ్య, జాతరను తలపించే రీతిలో కోలాహలంగా సాగింది.

హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో సొంతూరుకు హెలిప్యాడ్ వద్దే బ్రహ్మరథం:
మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్ లో కొండారెడ్డిపల్లి హెలిప్యాడ్



కు చేరుకున్న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. హెలిప్యాడ్ వద్ద నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి



నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని మిగతా 2లో..




## ఎమ్మెల్యేలకు
# పీఏల గండం
## తెలంగాణలో కొన్ని జిల్లాల్లో వసూళ్ల జాతర..!

**ఎల్ఓసీ కావాలన్నా, సీఎం రిలీఫ్ ఫండ్ కావాలన్నా, సిఫారసు లెటర్ కావాలన్నా పీఏలకు ముడుపు తప్పదా..?**

**కాంగ్రెస్ శ్రేణుల్లోనే గుసగుసలు కొన్ని చోట్ల ఎమ్మెల్యేల ప్రమేయంపైనా అనుమానాలు**




తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 21, (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేలు, మంత్రుల పీఏల తీరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ప్రజా సేవ కోసం, ప్రజలకు, నాయకులకు వారధిగా ఉండాల్సిన పీఏ వ్యవస్థ, ప్రజలకు గండంగా, పార్టీకి భారంగా మారిందనే చర్చ సొంత పార్టీలోనే జోరుగా జరుగుతోంది. కాంగ్రెస్ నాయకులే గుసగుసలాడుకుంటున్న పరిస్థితి నెలకొందని విశ్వసనీయ సమాచారం. సాధారణంగా ఎమ్మెల్యేను కలవాలన్నా, మంత్రిని కలవాలన్నా, ఏదైనా చిన్న పని చేయించుకోవాలన్నా పీఏల ద్వారానే వెళ్లాలి. ఇదే అదునుగా చేసుకుని కొన్ని నియోజకవర్గాల్లో పీఏలు రేట్లు ఫిక్స్ చేసి జోరుగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల ఏకంగా ఎమ్మెల్యేల ప్రమేయంతోనే వసూళ్ల మిగతా 2లో..

## మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

- చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- జంబూ సవారి వేడుకలను వీక్షించిన ముఖ్యమంత్రి



మిగతా 2లో..

## 2028 నాటికి పోలీసు శాఖలో
# ఖాళీలన్నీ భర్తీ

- పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- పోలీసు ఉద్యోగాల భర్తీకి 2026లో మరో 5 వేల పోస్టులకు అనుమతి
- అమరుల కుటుంబాలకు పరిహారం పెంపు..
- హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపు దిశగా చర్యలు
- సైబర్ నేరాలు, డ్రగ్స్, ఆహార కల్తీపై ఉక్కుపాదం





హైదరాబాద్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర పోలీసు శాఖలో సిబ్బంది కొరతను పూర్తిగా నివారించేందుకు విడతలవారీగా నియామకాలు చేపట్టి 2028 నాటికి అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మారుతున్న నేర స్వభావాలకు అనుగుణంగా పోలీసు శాఖను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ప్రసంగించారు.
పోలీసు అమరవీరుల సంస్మరణ దినం భావోద్వేగంతో కూడిన రోజని, సమాజ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.
ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో మిగతా 2లో..

## పోలీసు అమరవీరులకు
# ఘన నివాళి
## త్యాగాలను స్మరించిన జిల్లా పోలీస్ శాఖ

- అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- వారి కుటుంబాలను మరువకూడదు
- ఎస్పీ జానకి ఉద్వేగ సందేశం






తెలంగాణ స్టేట్ బ్యూరో,మహబూబ్ నగర్, అక్టోబర్ 21, (విజన్ ఆంధ్ర): దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కవాతు మైదానంలో బుధవారం ఘనంగా స్మృతి పరేడ్ నిర్వహించారు. ఎస్పీ జానకి ముఖ్య అతిథిగా హాజరై అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పించి, అమరవీరులకు సెల్యూట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. మిగతా 2లో..

## ఎర్రవెల్లిలో అంగరంగ వైభవంగా కేసీఆర్ దసరా వేడుకలు

*కుటుంబ సమేతంగా శమీ, వాహన, ఆయుధ పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత ఫాంహౌస్ కు పోటెత్తిన బీఆర్ఎస్ శ్రేణులు*





మిగతా 2లో..

## తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు..

- 19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు
- గత ఏడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి
- బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా పెరుగుదల
- 30.37 లక్షల కేసులకు చేరిన బీర్ల విక్రయాలు
- IMFL అమ్మకాలు 18.38 లక్షల కేసులకు పెరుగుదల
- అక్టోబర్ 19న రూ.303.40 కోట్ల విక్రయాలు




మిగతా 2లో..

# నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి



- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- నిత్యవసరాల ధరల పెరుగుదలను నియంత్రించాలని సీఎం ఆదేశం
- ఎల్ నినో ప్రభావం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచన
- పీఎం సూర్యఘర్ కనెక్షన్ల ఏర్పాటును వేగవంతం చేయాలన్న చంద్రబాబు
- ఇసుక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం

రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలపై భారం పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నాయని, దాని ప్రభావం రాష్ట్రంపై పడకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అమ్మకాలపై ఆయన ఆరా తీశారు. మిగతా 2లో..

# మా ప్రభుత్వంలో అవినీతి
## *టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యల వెనుక అసలు కథేంటి?*

- కాంగ్రెస్ ను బతికించే ప్రయత్నమా? భూస్థాపితం చేసే వ్యూహమా?
- మహేష్ కుమార్ గౌడ్ నోట అసలు నిజం వచ్చే ఎన్నికలకు సంకేతమా?



తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన ఒక్క వ్యాఖ్య ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ లో పెద్ద చర్చకు దారితీసింది. “మా ప్రభుత్వంలో అవినీతి పెరిగింది ఒప్పుకుంటా కింది స్థాయి నుంచి మంత్రుల వరకు అందరూ అవినీతి చేస్తున్నారు” అనే ఆయన మాటల వెనుక అసలు కారణం ఏంటి? అధికారంలో ఉండి కూడా సొంత ప్రభుత్వంపైనే ఎందుకు మిగతా 2లో..

## మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి



మైసూరు, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) : కర్ణాటక రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించే మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు మైసూరుకు చేరుకున్న ఆయన, ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జంబూ సవారీ వేడుకలను వీక్షించారు. మైసూరు దసరా ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన జంబూ సవారీలో అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో కన్నడ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే జానపద కళాకారులు, సంగీత బృందాలు, నృత్య బృందాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దసరా ఉత్సవాల్లో పాల్గొనడానికి ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైసూరు ప్రజల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందిన అనంతరం మైసూరు రాజభవనం ముందు నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్ర పండుగగా ప్రసిద్ధి చెందిన మైసూరు దసరా ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావం, కళలు, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయి. ఈ వేడుకలను కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో పాటు దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులతో కలిసి రేవంత్ రెడ్డి వీక్షించారు.

## ఎర్రవెల్లిలో అంగరంగ వైభవంగా కేసీఆర్ దసరా వేడుకలు

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 21, (విజన్ ఆంధ్ర) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తన ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో దసరా వేడుకలను అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులందరితో కలిసి దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు.

*వేద మంత్రోచ్ఛారణల మధ్య పూజలు:*

బుధవారం ఉదయం నుంచే ఎర్రవెల్లి ఫాంహౌస్ దసరా శోభను సంతరించుకుంది. వేద పండితులను ఆహ్వానించి, వారి మంత్రోచ్ఛారణల నడుమ కేసీఆర్ పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత తన ఫాంహౌస్ లోని శమీ వృక్షానికి (జమ్మి చెట్టు) ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన జమ్మి చెట్టును పూజించి, ఆకులను ప్రసాదంగా స్వీకరించారు. అనంతరం ఆయుధ పూజ, వాహన పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తన వద్ద ఉన్న వాహనాలకు, ట్రాక్టర్లకు, వ్యవసాయ పనిముట్లకు పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజలు చేశారు. రైతుగా తన వ్యవసాయ పరికరాలను పూజించడం ఆనవాయితీగా వస్తోంది.

*కుటుంబమంతా ఒకచోట:*

ఈ దసరా వేడుకల్లో కేసీఆర్ సతీమణి శోభమ్మ, తనయుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,కోడలు శైలిమ, మనవడు హిమాన్షు, మనవరాలు తదితర కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. కుటుంబ సభ్యులందరూ ఒకరికొకరు జమ్మి ఇచ్చుకుని, ఆలింగనం చేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎర్రవెల్లి నివాసం మొత్తం పండుగ వాతావరణం నెలకొంది.

*బీఆర్ఎస్ శ్రేణులతో కిటకిటలాడిన ఫాంహౌస్:*

కేసీఆర్ దసరా వేడుకలకు హాజరవుతున్నారన్న విషయం తెలియడంతో ఉమ్మడి మెదక్, సిద్దిపేట జిల్లాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా ఎర్రవెల్లికి తరలివచ్చారు. వచ్చిన ప్రతి ఒక్కరికి కేసీఆర్ జమ్మి ఇచ్చి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అందరినీ పేరు పేరునా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

## తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు..

తెలంగాణలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే విక్రయాలు 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడించాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ గణనీయంగా పెరగడం ఈసారి ప్రత్యేకంగా కనిపించింది. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (×వీఖీ)తో పోలిస్తే బీర్ల విక్రయాలు వేగంగా పెరిగాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 30.37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఇక ×వీఖీ విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులుగా ఉండగా, ఈసారి 18.38 లక్షల కేసులకు పెరిగాయి. అక్టోబర్ 19న రాష్ట్రంలో ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు నెమ్మదిగా సాగినా, రెండో వారం నుంచి వేగం పుంజుకున్నాయి. అక్టోబర్ 16 నాటికి మొత్తం విక్రయాల విలువ రూ.1,527.85 కోట్లుగా ఉండగా, మరో మూడు రోజుల్లోనే రూ.2,000 కోట్ల మార్కును దాటింది. అక్టోబర్ 19 వరకు నమోదైన గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

## నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి

ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు వివరించగా.. దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలో కూడా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని, దీన్ని మరింత మెరుగుపరచాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో తొమ్మిది లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, దీని కోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ఇసుక సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం సూచించారు. పాలనలో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరులకు ఘన నివాళి

1959 నాటి చరిత్రను గుర్తు చేసిన ఎస్పీ:

ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్ లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారని, వారి త్యాగానికి గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మహిళా చిన్నారుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తోందని, విధి నిర్వహణలో పోలీసులు కుటుంబాలకు దూరంగా ఉంటూ, ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల రక్షణ కోసం పనిచేస్తారని ఎస్పీ కొనియాడారు.

అమరవీరుల కుటుంబాలకు భరోసా:

అనంతరం జిల్లాలో అమరులైన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులను ఎస్పీ జానకి స్వయంగా కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు.

నగరంలో స్మారక ర్యాలీ పరదేశి నాయుడు విగ్రహానికి నివాళి:

పరేడ్ అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి క్లాక్ టవర్, రామ్ మందిర్ చౌరస్తా, లైబ్రరీ మీదుగా వన్ టౌన్ లోని పరదేశి నాయుడు సర్కిల్ వరకు భారీ అమరవీరుల స్మారక ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నినాదాలు చేశారు. పరదేశి నాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏఆర్ సురేష్ కుమార్, జైలు సూపరింటెండెంట్ కాళిదాస్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణా రెడ్డి, ఆనంద్, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా పోలీసు సిబ్బంది భారీగా పాల్గొన్నారు.

# మా ప్రభుత్వంలో అవినీతి

విమర్శలు చేయాల్సి వచ్చింది? ఇది కాంగ్రెస్ ను బతికించే ప్రయత్నమా? లేక భూస్థాపితం చేసే వ్యాఖ్యనా? అనే చర్చ ఇప్పుడు జోరుగా సాగుతోంది.

**ఎందుకు ఈ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చింది?**

క్యాడర్ లో అసంతృప్తి:లి గత 10 నెలలుగా కాంగ్రెస్ క్యాడర్ లో తీవ్ర అసంతృప్తి ఉందనే టాక్ ఉంది. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పదవులు, పనులు కావడం లేదని, కేవలం కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ఉన్న వారికే అన్నీ జరుగుతున్నాయనే ఫీలింగ్ ఉంది. కింది స్థాయిలో ఇసుక, ట్రాన్స్ ఫర్లు, పనుల విషయంలో అవినీతి జరుగుతోందని కార్యకర్తల నుంచే ఫిర్యాదులు టీపీసీసీ చీఫ్ కు పెద్ద ఎత్తున వెళ్లాయి. వాటిని కవర్ చేయకుండా ముక్కుసూటిగా చెప్పడం ద్వారా క్యాడర్ కు దగ్గరవ్వాలనే ప్రయత్నంగా దీన్ని చూస్తున్నారు. మంత్రులపై నియంత్రణ లేదా? రెవెన్యూ, మైనింగ్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల్లో అవినీతి పెరిగిపోయిందనే ఆరోపణలు ప్రతిపక్షాల నుంచే కాదు, సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచే వస్తున్నాయి. మంత్రులు కూడా కలెక్షన్లకు పాల్పడుతున్నారనే టాక్ పార్టీలోనే ఉంది. దీన్ని అదుపు చేయలేకపోతున్నామని పరోక్షంగా చెప్పడమే ఈ వ్యాఖ్యల ఉద్దేశమా అనే చర్చ కూడా ఉంది.

హైకమాండ్ కు సంకేతమా? తెలంగాణలో పరిస్థితి చేయి దాటిపోతోందని, వెంటనే హైకమాండ్ జోక్యం చేసుకోవాలని, మంత్రుల పనితీరుపై సమీక్ష చేయాలని చెప్పేందుకే మహేష్ కుమార్ గౌడ్ ఇలా బహిరంగంగా మాట్లాడారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. లోపల చెబితే వినడం లేదు కాబట్టే బయట చెప్పాల్సి వచ్చిందనే వాదన కూడా ఉంది.

**ఇది కాంగ్రెస్ ను బతికిస్తుందా? చంపేస్తుందా?**

ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఒకవైపు చూస్తే ముక్కుసూటిగా నిజం ఒప్పుకోవడం ద్వారా ప్రజల్లో "కాంగ్రెస్ లోనైనా నిజాయితీగా మాట్లాడే నాయకుడు ఉన్నాడు" అనే ఇమేజ్ వస్తుంది. తప్పును సరిదిద్దుకుంటామనే సంకేతం వెళ్తుంది. ఇది పార్టీకి ప్లస్ అవుతుంది. మరోవైపు అధికారంలో ఉండి కూడా అవినీతిని అరికట్టలేకపోతున్నామని సొంత పార్టీ అధ్యక్షుడే చెబితే, ప్రతిపక్షాలకు పెద్ద ఆయుధం ఇచ్చినట్లే. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఈ వ్యాఖ్యలనే ప్రధానంగా ప్రచారం చేస్తాయి. "కాంగ్రెస్ నేతలే ఒప్పుకున్నారు వీళ్లకు మళ్లీ ఓటేయాలా?" అని ప్రజల్లోకి తీసుకెళ్తారు. ఇది పార్టీని డ్యామేజ్ చేస్తుంది.

**మహేష్ కుమార్ గౌడ్ ఏం చూసి ఇలా అన్నాడు?**

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం ఇటీవల జిల్లాల పర్యటనలో కార్యకర్తలు నేరుగా మహేష్ కుమార్ గౌడ్ కు ఫిర్యాదులు చేశారు. "అన్నా.. మేము పార్టీ కోసం పని చేస్తే, మాకు పనులు కావడం లేదు. డబ్బు ఉన్న వారికే పనులు అవుతున్నాయి. ఎమ్మార్వో ఆఫీస్ లో, మండల ఆఫీస్ లో, పోలీస్ స్టేషన్ లో డబ్బు ఇవ్వకుండా ఏ పనీ కావడం లేదు" అని వాపోయారట. ఆవేదనతోనే ఆయన ఇలా స్పందించారని చెబుతున్నారు.

**ఫైనల్ గా సంకేతం ఏంటి?**

మొత్తానికి మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి హెచ్చరిక గంట లాంటివి. ప్రభుత్వం ఇప్పుడైనా కళ్లు తెరిచి అవినీతిపై ఉక్కుపాదం మోపకపోతే, వచ్చే ఎన్నికల్లో ప్రజలు క్షమించరనే సంకేతాన్ని ఆయన ఇచ్చారని విశ్లేషకులు అంటున్నారు. ఇది పార్టీని చంపే వ్యాఖ్య కాదు బతికించుకునేందుకు చేసిన హెచ్చరిక అనే టాక్ కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. మరి ప్రభుత్వం ఈ హెచ్చరికను సీరియస్ గా తీసుకుంటుందా? లేక లైట్ తీసుకుంటుందా? అనేది వేచి చూడాలి.

# 2028 నాటికి పోలీసు శాఖలో ఖాళీలన్నీ భర్తీ

ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసు సిబ్బందికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, వారి పిల్లల విద్య, భద్రత విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని భరోసా ఇచ్చారు.

***పోలీసు నియామకాలకు ప్రాధాన్యం***

రాష్ట్రంలో పెట్టుబడులు పెరగాలన్నా, పరిశ్రమలు, ఐటీ, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందాలన్నా శాంతిభద్రతలు కీలకమని సీఎం అన్నారు. ప్రజలు నిర్భయంగా జీవించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పోలీసు శాఖను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా 2025 అక్టోబర్ నాటికి దాదాపు 16 వేల మంది కానిస్టేబుళ్లు, ఎస్ఐలను నియమించినట్లు తెలిపారు. 2026లో మరో 5 వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి అనుమతించినట్లు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని, ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించామని చెప్పారు.

***అమరుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం***

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బందికి అందించే పరిహారాన్ని గణనీయంగా పెంచినట్లు ముఖ్యమంత్రి వివరించారు. కానిస్టేబుళ్లకు రూ.40 లక్షల నుంచి రూ.కోటి, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు రూ.45 లక్షల నుంచి రూ.కోటి, ఎస్ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ.1.25 కోట్లకు పెంచినట్లు తెలిపారు. డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు రూ.50 లక్షల నుంచి రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.కోటి నుంచి రూ.2 కోట్లకు పరిహారాన్ని పెంచినట్లు పేర్కొన్నారు.

ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, అమరవీరుల త్యాగాలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవమని అన్నారు. అర్హులైన అమరుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, ఉచిత విద్య, వైద్య సహాయం అందిస్తున్నామని తెలిపారు. వైద్య విద్యలో ప్రత్యేక సీట్లు కల్పిస్తున్నామని, భద్రతా సంక్షేమ నిధి నుంచి రూ.16 లక్షలు, సంక్షేమ నిధి నుంచి మరో రూ.8 లక్షలు అందించేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

***హోంగార్డుల సంక్షేమానికి చర్యలు***

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచే అంశంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హోంగార్డులకు వైద్య పరీక్షలు నిర్వహించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. హోదాతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి సేవలను ప్రభుత్వం గుర్తిస్తుందని చెప్పారు.

పోలీసు శాఖలో హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పనిచేస్తున్న సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో 44 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు వివరించారు.

***మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి***

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆహార కల్తీ వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి బారిన పడకుండా చూడటం అందరి బాధ్యతని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ తెలంగాణ విభాగం పనితీరును, డీజీపీని అభినందించారు.

కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు ప్రత్యేకంగా 'సీటీజీ సేఫ్' కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. మహిళల భద్రత కోసం షీ-టీమ్స్ సేవలను కొనసాగిస్తున్నామని, మహిళలకు అండగా నిలిచే సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలు, పిల్లలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణ అందించేందుకు 'స్పందన' తక్షణ రక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

***ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం***

పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు తాము ఒంటరి కాదని భావించాలని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వారి బాధను పూర్తిగా తొలగించలేకపోయినా, ప్రభుత్వం, పోలీసు శాఖ, తెలంగాణ సమాజం వారికి అండగా ఉంటాయని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణను బలంగా, నిజాయితీని గౌరవంగా భావించాలని సూచించారు. ప్రజలకు కల్పించే భరోసానే పోలీసులకు లభించే గొప్ప గుర్తింపు అని పేర్కొంటూ, ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కొండారెడ్డిపల్లి లో సీఎం రేవంత్ కు బ్రహ్మరథం











చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, భద్రతాధికారులు, సీఎం కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుండి ఓపెన్ టాప్ జీపులోకి ఎక్కిన సీఎం గ్రామంలోకి ర్యాలీగా బయలుదేరారు. వెంట ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తల వాహనాలతో భారీ కాన్వాయ్ కదిలింది.

***దప్పు దరువులు, బతుకమ్మ నృత్యాలు, పూల వర్షంతో జన నీరాజనం:***

గ్రామంలోకి ప్రవేశించగానే దృశ్యం పూర్తిగా మారిపోయింది. గ్రామ యువకులు డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాలతో, గజమాలలు, పూల జల్లులతో స్వాగతం పలికారు. మహిళలు సంప్రదాయ బతుకమ్మలతో, బొడ్డెమ్మలతో నృత్యాలు చేస్తూ వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. దారి పొడవునా గ్రామ మహిళలు హారతులు పట్టి, నుదుటన తిలకం దిద్ది స్వాగతించారు. చిన్నారులు పూల వర్షం కురిపించారు. ఓపెన్ టాప్ జీపులో నిలబడి సీఎం రెండు చేతులు జోడించి, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ప్రతి ఇంటి ముందు నుండి ప్రజలు బయటకు వచ్చి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

***కొండారెడ్డిపల్లి ప్రజలు ఆప్యాయంగా హత్తుకున్నారు చిన్ననాటి మిత్రులతో ఆత్మీయ ఆలింగనం:***

ఈ పర్యటనలో అత్యంత భావోద్వేగ ఘట్టం చోటుచేసుకుంది. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రజలు, వృద్ధులు, చిన్ననాటి మిత్రులు, సహచరులు సీఎంను చూడగానే ఆప్యాయంగా హత్తుకున్నారు. సీఎం కూడా తన చిన్ననాటి మిత్రులను పేరుపేరునా పిలిచి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొందరిని ఆత్మీయంగా కౌగిలించుకున్నారు, భుజం తట్టి పలకరించారు. గ్రామ పెద్దలు, స్థానికులతో కలిసి కాసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. స్వగ్రామంతో తనకున్న అనుబంధాన్ని, తన వేర్లను మరిచిపోలేదని చాటుకున్నారు. పండుగ వేళ తమ మధ్యకు వచ్చిన ముఖ్యమంత్రిని చూసి గ్రామస్థులు ఆనందంతో కంటతడి పెట్టుకున్నారు. కొండారెడ్డిపల్లి ప్రజలు సీఎంను తమ ఇంటి బిడ్డలా హత్తుకోవడం అందరినీ కదిలించింది.

***ఆంజనేయ స్వామి, కొట్ట మైసమ్మ ఆలయాల్లో కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు:***

గ్రామంలో పర్యటించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక శ్రీ ఆంజనేయ స్వామివారి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి వేద పండితులు పూర్ణకుంభంతో, మంత్రోచ్ఛారణల నడుమ, మంగళ వాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు సమర్పించారు. రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. అక్కడి నుండి కొట్ట మైసమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

***జమ్మి చెట్టుకు శాస్త్రోక్తంగా పూజ రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు:***

విజయదశమి వేడుకల్లో అత్యంత విశిష్ట ప్రాధాన్యం కలిగిన జమ్మి పూజను సీఎం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ సరిహద్దులో ఉన్న జమ్మి చెట్టు వద్దకు కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి పాదయాత్రగా వెళ్లి శమీ పూజ చేశారు. జమ్మి ఆకులను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయం, సంతోషం తీసుకురావాలని అభిలషించారు.

***కొండారెడ్డిపల్లి నుండి కల్వకుర్తికి రావణ దహనంలో సీఎం కల్వకుర్తి ప్రజలతో మమేకం:***

కొండారెడ్డిపల్లిలో దసరా ఉత్సవాలను ముగించుకున్న సీఎం అక్కడి నుండి నేరుగా కల్వకుర్తి పట్టణానికి బయలుదేరారు. కల్వకుర్తి బిఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కల్వకుర్తి ప్రజలు కూడా సీఎంకు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే విజయదశమి అని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు విశిష్ట స్థానం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల, మాజీ చైర్మన్లు శ్రీశైలం, ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయాలకు ప్రతీకగా, కుటుంబ అనుబంధాలకు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు నిదర్శనంగా కొండారెడ్డిపల్లి, కల్వకుర్తిలో దసరా వేడుకలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి.

# ఎమ్మెల్యేలకు పీఏల గండం

జరుగుతున్నాయనే ప్రచారం కూడా కాంగ్రెస్ శ్రేణుల్లోనే జరుగుతోంది.

***అపాయింట్‌మెంట్ కావాలంటే ఒక రేటు దరఖాస్తు ఇప్పించాలంటే ఇంకో రేటు:***

ప్రజల నుండి అందుతున్న సమాచారం ప్రకారం ప్రతి పనికి ఒక రేటు ఫిక్స్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే అపాయింట్‌మెంట్ కావాలంటే ఒక రేటు, దరఖాస్తు ఇప్పించాలంటే ఇంకో రేటు అన్నట్టుగా తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్శనాల కోసం ఇచ్చే సిఫారసు లెటర్, కాలేజీ ఫీజు తగ్గింపు లెటర్, గురుకులాల్లో సీట్లు, నీటి సౌకర్యం వంటి చిన్న పనుల నుండి, పెద్ద పనుల వరకు పీఏలకు డబ్బులు ముట్టాల్సిందే అనే పరిస్థితి కొన్ని నియోజకవర్గాల్లో నెలకొందని చెబుతున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసీ, సీఆర్ఎల్ఆర్ఎఫ్, టోకెన్ జాబితాలో పేరు చేర్చడం, స్పెషల్ పికప్ శాంక్షన్ వంటి మానవతా దృక్పథంతో, అత్యవసరంగా చేయాల్సిన పనులకు కూడా పీఏలకు ముడుపులు చెల్లించాల్సి వస్తోందనే ఆరోపణలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి.

***కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలే టార్గెట్:***

బిల్లుల కోసం వచ్చే కాంట్రాక్టర్లు, పోస్టింగ్ ల కోసం, బదిలీల కోసం వచ్చే ఉద్యోగులు, పనుల కోసం వచ్చే వ్యాపారవేత్తల దగ్గర కూడా ఇదే తరహా వసూళ్లు జరుగుతున్నాయని చర్చ జరుగుతోంది. సిఫారసు లేఖలు, పోస్టింగ్ లెటర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామక లెటర్లకు, సీఐ, తహసీల్దార్, ఎక్సైజ్ సీఐ పోస్టింగ్ సిఫారసు లెటర్లకు భారీగా వసూళ్లు చేస్తున్నట్టు సమాచారం. పోలీస్ స్టేషన్లలో సీఐ, డీఎస్పీ, ఎస్పీలకు ఫోన్ చేసి కేసు లేకుండా చెప్పేందుకు కూడా రేట్లు ఫిక్స్ చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

***పేదలను కూడా వదలడం లేదనే ఆవేదన ఎల్ఓసీ, సీఎం రిలీఫ్ ఫండ్ కు కూడా ముడుపులా..?***

డబ్బులు లేక సహాయం కోసం వచ్చే నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడే రోగులను కూడా వదలడం లేదని, ఎల్ఓసీ, సీఎం రిలీఫ్ ఫండ్ వంటి అత్యవసర, ప్రాణాపాయ సహాయం కోసం వచ్చే వారి దగ్గర కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆవేదన ప్రజల్లో తీవ్రంగా వ్యక్తమవుతోంది. ఏది ఇచ్చినా, ఏ సిఫారసు లెటర్ ఇచ్చినా, ఏ సహాయం చేసినా కచ్చితంగా పీఏలకు డబ్బులు ముట్టాల్సిందే అనే దుస్థితి ఏర్పడిందని, ఇది ప్రభుత్వ ప్రతిష్టకు, పార్టీ ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగిస్తోందని సీనియర్ కాంగ్రెస్ నాయకులే అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.

***పీఏల చేతిలో అధికారులు:***

ఇక స్థానిక పోలీస్ స్టేషన్‌లో, రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో పరిచయాలు పెంచుకుని, పీఏలు చెబితేనే పనులు జరిగేలా అధికారులను తమ కంట్రోల్‌లో పెట్టుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

***పార్టీలోనే గుసగుసలు కొన్ని చోట్ల ఎమ్మెల్యేలే వసూలు చేస్తున్నారా..?***

ఇప్పటివరకు పీఏల పేరుతో వసూళ్లు జరుగుతున్నాయని అనుకుంటే, తాజాగా కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ప్రమేయం కూడా ఉందనే గుసగుసలు కాంగ్రెస్ శ్రేణుల్లోనే బలంగా వినిపిస్తున్నాయి. పీఏలు వసూలు చేసిన మొత్తంలో కొంత భాగం పైకి వెళుతోందనే ప్రచారం జరుగుతోంది.

***ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీకే నష్టం మళ్లీ అధికారంలోకి రావడం కష్టమే..?***

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీకే తీవ్ర నష్టం వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు, సీనియర్ నాయకులు హెచ్చరిస్తున్నారు. ప్రజలకు సేవ చేయడానికి అధికారం ఇస్తే, పీఏల చేతిలో ప్రజలు ఇబ్బందులు పడితే ప్రభుత్వంపైనే వ్యతిరేకత వస్తుందని, దీని ప్రభావం నేరుగా పార్టీపై పడుతుందని చెబుతున్నారు. ప్రజల్లో ఇప్పటికే తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని, దీన్ని సరిదిద్దకపోతే రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, పీఏల తీరు కారణంగా ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజలకు దూరమవుతున్నారని కాంగ్రెస్ శ్రేణుల్లోనే ఆందోళన వ్యక్తమవుతోంది. వెంటనే పార్టీ అధిష్ఠానం, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని పీఏల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకే ప్రమాదం అని సొంత పార్టీ నేతలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# దక్షిణాదిలో కాక్రోచ్ ఉద్యమాలకు జీరో క్రేజ్

ఢిల్లీ కేంద్రంగా జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తూ, ఉత్తరాది ప్రసార మాధ్యమాల్లో రోజంతా అగ్రస్థానంలో నిలుస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాలు దక్షిణాది రాష్ట్రాలకు వచ్చేసరికి పూర్తిగా నిస్తేజంగా మారాయి. ఢిల్లీ విధుల్లో సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మీమ్‌ల ఆధారంగా సాగుతున్న ఈ వినూత్న పొలిటికల్ ట్రెండ్స్‌ను నేషనల్ మీడియా సర్వస్వంగా భావించి ప్రసారం చేస్తున్నప్పటికీ, దక్షిణాదిలో మాత్రం దీనికి కనీస ఆదరణ కూడా లభించడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి ప్రధాన దక్షిణ భారత ప్రాంతాల్లో ఈ ఉద్యమం కనీస ప్రభావం చూపలేక చతికిలబడింది. ఇక్కడి స్థానిక మీడియా సంస్థలు అక్కడక్కడ కొన్ని వార్తలు ప్రచురించే ప్రయత్నం చేసినా, సాధారణ ప్రజానీకం, యువత దీనిని ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.ఢిల్లీ , ఉత్తరాదిలోని ప్రధాన నగరాల్లో భారీగా వైరల్ అవుతున్న ఈ ట్రెండ్‌ను దక్షిణాది సమాజం, ముఖ్యంగా ఇక్కడి యువత పూర్తిగా తిరస్కరించడానికి ఇక్కడి ప్రత్యేకమైన సామాజిక, ఆర్థిక పరిస్థితులే ప్రధాన కారణమని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉత్తరాదిలోని రాజకీయ వాతావరణం, అక్కడి నిరుద్యోగ నిరసన తీరుకు, దక్షిణాది యువత ఆలోచనా ధోరణికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంది. కాలక్షేపం కోసమో లేదా సోషల్ మీడియాలో సంచలనం కోసమో చేసే ఉద్యమాల కంటే.. తమ ఉజ్వల భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి , ఆర్థిక స్వావలంబనే ప్రాథమిక లక్ష్యమని భావించే దక్షిణాది యువత ప్రాగ్మాటిక్ ఆలోచనా విధానమే ఈ కాక్రోచ్ ఉద్యమాలు ఇక్కడ అడుగుపెట్టకుండా నిరోధించింది. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులు సుదీర్ఘకాలంగా సమాచార సాంకేతిక రంగం , తయారీ రంగం, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు , స్టార్టప్ రంగానికి కేంద్రబిందువులుగా ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో యువత తమ దృష్టినంతా కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , కొత్త నైపుణ్యాల అప్‌గ్రేడేషన్ . ఐటీ, గ్లోబల్ పరిశ్రమల్లో అవకాశాల సాధనపైనే నిలుపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ నిరసనల పేరిట కాలం వృథా చేసుకోవడం కంటే, గ్లోబల్ మార్కెట్‌లో తమ అర్హతలను పెంచుకోవడం మరియు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.దక్షిణాదిలో ప్రాంతీయ రాజకీయ చైతన్యం చాలా బలంగా ఉంటుంది. తమిళనాడులోని ద్రవిడ సిద్ధాంతం, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లలోని బలమైన స్థానిక ప్రాంతీయ పార్టీలు, శ్రేణుల నిర్మాణం కారణంగా.. బయటి నుంచి దిగుమతి అయ్యే డిజిటల్ పొలిటికల్ సటైర్ ఉద్యమాలకు ఇక్కడ స్వతంత్ర స్పేస్ లభించడం లేదు. క్షేత్రస్థాయి సమస్యలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు మరియు ప్రాజెక్టుల పురోగతిపైనే ఇక్కడి రాజకీయ చర్చలు నడుస్తాయి తప్ప, ఢిల్లీ వీధుల్లో పుట్టుకొచ్చే తాత్కాలిక మీమ్ ట్రెండ్స్ ఇక్కడి ప్రజల మద్దతును పొందలేవు.ఢిల్లీలో పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ ప్రధానంగా ఎక్స్ , ఆన్‌లైన్ నిరసనలకు పరిమితమైన ఒక ట్రెండ్ మాత్రమే. దక్షిణాది యువత డిజిటల్ మాధ్యమాలను విజ్ఞానార్జనకు, గిగ్ ఎకానమీలో అవకాశాలకు, లేదా వినోదానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు తప్ప, తమ భవిష్యత్తును పణంగా పెట్టి అర్థం లేని ఉద్యమాల వెనుక పరిగెత్తడం లేదు.

పొరుగున ఉన్న విద్యార్థులు, యువత నైపుణ్య ఆధారిత కోర్సులు, పోటీ పరీక్షల శిక్షణపై దృష్టి సారించడాన్ని ఇక్కడ ప్రాధాన్య అంశంగా చూస్తున్నారు. దక్షిణాదిలో యూత్ ఎందుకు వీటిపై ఆసక్తి చూపడం లేదో పరిశీలిస్తే.. ఇక్కడి యువత ఎప్పుడూ ఖాళీగా ఉండరనే వాస్తవం స్పష్టమవుతుంది. ఐటీ రంగాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, పారిశ్రామిక కారిడార్లు, సాంకేతిక , సేవారంగాలు విస్తరించి ఉన్న దక్షిణ భారతదేశంలో యువత తమ కెరీర్ నిర్మాణమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. గ్లోబల్ కాంపిటీషన్ ఎదుర్కొంటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తీవ్రంగా శ్రమించే యువతకు, ఇలాంటి ప్రయోగాత్మక, వ్యంగ్య రాజకీయ ఉద్యమాల వైపు దృష్టి పెట్టేందుకు సమయం ఉండదు. కేవలం సోషల్ మీడియాలో రీక్రియేషన్ కోసం చూసి వదిలేయడమే తప్ప, వీటిని సీరియస్‌గా తీసుకునేంత ఖాళీ వాతావరణం ఇక్కడ కనిపించదు.అంతేకాకుండా, దక్షిణ భారతదేశంలోని విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల రాజకీయాల ప్రభావం ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే చాలా తక్కువ. క్యాంపస్‌లలో ప్రత్యక్ష రాజకీయాల ప్రమేయం, యూనివర్సిటీల జోక్యం చాలా వరకు పరిమితంగా ఉంటుంది.?

విద్యార్థులు చదువు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఉన్నత చదువుల వైపు దృష్టి సారిస్తారే తప్ప, ఇలాంటి నిరసనలు, అరాచక తరహా ఉద్యమాల వైపు ఆకర్షితులు కారు. కాలేజీ రోజుల్లోనే భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత ఉండే దక్షిణాది విద్యార్థులు, భావోద్వేగాల కంటే కెరీర్ నిలదొక్కుకోవడానికే తొలి ప్రాధాన్యత ఇస్తారు.మరోవైపు, దక్షిణాది రాజకీయ సంస్కృతి కూడా పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇక్కడ ప్రాంతీయ పార్టీల ప్రభావం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆధారిత రాజకీయాలే తప్ప, ఇలాంటి విచిత్రమైన నామకరణాలతో కూడిన ఉద్యమాలు స్థానిక ప్రజలను ఆకట్టుకోలేవు. ఉత్తరాదిలో నిరుద్యోగ నిరాశ నిస్పృహల నుంచి పుట్టుకొచ్చిన కొన్ని వ్యంగ్య ధోరణులు అక్కడ చర్చనీయాంశం కావొచ్చు, కానీ ప్రయోజనాత్మక దృక్పథం కలిగిన దక్షిణ భారతదేశం మాత్రం ఇలాంటి ట్రెండ్స్‌ను ఎప్పుడూ పక్కన పెడుతూ వస్తోంది.

మీడియా ఎంతగా హోరెత్తించినా దక్షిణాదిలో కాక్రోచ్ ఉద్యమాలకు జీరో క్రేజ్ దక్కడం వెనుక ఇక్కడి యువత మెచ్యూరిటీ స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం కాలక్షేపం కంటెంట్ కంటే తమ ఉజ్వల భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబనే ముఖ్యమమని భావించే ఇక్కడి యువత ఆలోచనా విధానమే, ఈ ఉద్యమాలను ఇక్కడ కనీస ప్రభావం కూడా చూపకుండా అడ్డుకుంటోంది. ఉత్తరాది మీడియా ఎంత హడావుడి చేసినా, దేశీయ రాజకీయాల్లో ప్రభావం చూపుతుందని ప్రచారం చేసినా, దక్షిణాది ప్రగతిశీల సమాజం దానికి పూర్తిగా దూరంగా నిలిచింది. కేవలం డిజిటల్ సంచలనాల ఆధారంగా నడిచే రాజకీయ ఉద్యమాలకు కాలం చెల్లిందని, ప్రగతి సాధన, ఆర్థిక పురోగతే ఏకైక అజెండా అని దక్షిణాది యువత తమ నిశ్శబ్ద తిరస్కరణ ద్వారా మరోసారి స్పష్టం చేసింది.

# కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్!

- ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ నేతల మర్యాదపూర్వక భేటీ
- కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు.. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ వేళ జరిగిన ఈ భేటీలో నేతలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు.

# ఓపెన్ కాస్ట్ బొగ్గు బొగ్గు గనిని నిలిపివేయాలి

- రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోహన్ రావు
- మంత్రి సీతక్కకు వినతి
- రామప్ప పరిరక్షణ అందరి బాధ్యత
- ఓపెన్ కాస్ట్ బొగ్గు గనికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అనుమతి ఇవ్వలేదు
- ఈ ప్రాంత ప్రజలు అధైర్య పడొద్దని సీతక్క హామీ



వెంకటాపూర్ శివారులో ఏర్పాటు చేయనున్న ఓపెన్ కాస్ట్ బొగ్గు గని వల్ల ప్రపంచ వారసత్వ సంపద గల రామప్ప దేవాలయానికి ముప్పు వాటిల్లనుందని రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ అక్కిరెడ్డి రామ్మోహన్ రావు అన్నారు. బుధవారం తన పర్యటలో భాగంగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామానికి చేరుకున్న మంత్రి సీతక్కను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోహన్ రావు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు.ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిలో భాగంగా జరిపే బ్లాస్టింగ్ ల వల్ల ఎనిమిది వందల ఏళ్ల చరిత్ర గలిగిన రామప్ప దేవాలయ నిర్మాణం దెబ్బతినే అవకాశం ఉందని, శతాబ్దాల నాటి శిల్పాలతో పాటు గుడి కూలిపోయే ప్రమాదం ఉందని ఆయన మంత్రి వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. రామప్ప ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిందని, రామప్ప పరిరక్షణ కై ప్రభుత్వం కృషి చేయాలని ఆమెను కోరారు. స్పందించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ...ప్రపంచ



వారసత్వ సంపద కలిగిన రామప్ప దేవాలయాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, అలాంటి రామప్పకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త వహిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు ఓపెన్ కాస్ట్ బొగ్గు గనికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని, ఈ ప్రాంత ప్రజలు ఎవరూ అధైర్య పడవద్దని ఆమె సూచించారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి తవ్వకాలు చేపట్టకుండా అధికారులతో సమావేశమై చర్చిస్తానని, పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక లేకుండా ఎలాంటి ప్రాజెక్టుకూ అనుమతి లేదని స్పష్టం చేశారు. దీంతో రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామ్మోహన్ రావు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు మంత్రి సీతక్కకు అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు.. యువకుడు మృతి

- ఎన్‌హెచ్-161పై ఘోర రోడ్డు ప్రమాదం..
- కారులో పలువురికి తీవ్ర గాయాలు



చౌటకూర్ అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): సంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధిలోని జాతీయ రహదారి 161పై బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అల్మాయిపేట దర్గా సమీపంలో బైక్‌ను కారు బలంగా ఢీకొట్టడంతో అల్మాయిపేట గ్రామానికి చెందిన రాయిని శ్రీకాంత్ (25) మృతి చెందాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. అల్మాయిపేట గ్రామానికి చెందిన రాయిని శ్రీకాంత్ తన బైక్‌పై చెట్కూర్ నుంచి అల్మాయిపేట వైపు వెళ్తూ రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ఎర్రారం నుంచి సంగారెడ్డి వైపు వేగంగా వెళ్తున్న కారు అతని బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. బైక్‌ను ఢీకొట్టిన అనంతరం కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి పలుమార్లు పల్టీలు కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. 25 ఏళ్ల యువకుడు రాయిని శ్రీకాంత్ మృతి చెందడంతో అల్మాయిపేట గ్రామంలో విషాదం నెలకొంది. ఈ ఘటన స్థానికులను కలచివేసింది.

# జగన్‌ను ర్యాగింగ్ చేసిన విజయసాయి!

విజయవాడ ,అక్టోబరు 21 : మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి దసరా పండుగ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి సంబంధించిన ముహూర్తాన్ని, ఆశయాలను వెల్లడిస్తూ కీలక ప్రకటన చేశారు. ఈ క్రమంలో ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా కొత్త పార్టీ ఆవిర్భవించబోతోందని స్పష్టం



చేశారు. రాష్ట్రంలో 2 పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలకడం, కులపిచ్చి, మతపిచ్చి రాజకీయాలను రూపుమాపడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. అలాగే రెడ్ బుక్ రాజ్యాంగం, రప్పారప్పా ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించి, కరువు కాటకాలు, కరెంటు కోతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామని దసరా పండుగరోజు మాజీ ఎంపీ ప్రకటించారు.విజయసాయిరెడ్డి తన కొత్త పార్టీ ప్రకటన తేదీని, ముహూర్తాన్ని ప్రకటించారు. అన్నీ పదకొండులు వచ్చేలా చూసుకున్నారు. గతంలో దసరాకే పార్టీ పెడతానని చెప్పిన ఆయన .. పార్టీ పెట్టే రోజును దసరా రోజునుప్రకటించారు. ఆ రోజును, ముహూర్తాన్ని చూస్తే ఆయన జగన్ రెడ్డిని ర్యాగింగ్ చేశారని సులువుగా అర్థమైపోతుంది. 11వ నెల 11వ తేదీన సరిగ్గా ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ-కన్వెన్షన్‌లో నూతన పార్టీని ఘనంగా ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు.గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘోర పరాజయం పాలై కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. అప్పట్నుంచి 11 అంటే వైసీపీ నేతలు ఉలిక్కి పడుతున్నారు. విపక్ష హోదా కూడా దక్కకుండా చేసిన ఆ 11 సంఖ్య జగన్‌కు, వైఎస్సార్సీపీ శ్రేణులకు రాజకీయంగా ఒక పెద్ద పీడకలగా మారింది. అలాంటి పచ్చి పుండుపై కారం చల్లేలా.. విజయసాయిరెడ్డి తన పార్టీ ప్రకటన ముహూర్తంలో నెల, తేదీ, గంటలు, నిమిషాలు అన్నీ కలిపి వరుసగా 11:11:11:11 వచ్చేలా పక్కాగా సెట్ చేశారు. గతంలో జగన్‌కు ఆర్థిక, రాజకీయ సలహాదారుగా నిలిచి లెక్కల మాస్టారు గా పేరుగాంచిన సాయిరెడ్డి.. ఇప్పుడు అదే లెక్కలతో జగన్ ఓటమి సంఖ్యను గుర్తుచేస్తూ పబ్లిక్‌గా ట్రోల్ చేశారుకేవలం ముహూర్తంతోనే ఆగకుండా పార్టీ ఎజెండా ద్వారా కూడా జగన్ పాలనను, వైఎస్సార్సీపీ మూలాలను విజయసాయిరెడ్డి తీవ్రంగా ఎద్దేవా చేశారు. రెండు పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలికేలా.. రప్పరప్ప ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించేలా.. జెన్-జీ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా తమ పార్టీ వస్తోందని పోస్టర్‌లో పేర్కొనడం జగన్‌ను నేరుగా టార్గెట్ చేయడమే. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత ప్రయోజనాలు చూసుకున్నారని, యువతను కేవలం జేజేలు కొట్టే గుంపులుగా మార్చారని దశకంఠుడి అవలక్షణాలంటూ 10 పాయింట్లతో జగన్ రాజకీయ తీరును ఉతికి ఆరేశారు. నిన్నటిదాకా తమతో ఉన్న ముఖ్య నేతే ఇలా 11 నంబర్‌తో వ్యంగ్యాస్త్రాలు సంధించడం తాడేపల్లి ప్యాలెస్‌కు మింగుడుపడటం లేదుకొన్ని రోజుల కిందట విజయసాయిరెడ్డి పార్టీ ఆవిర్భావం ప్రకటన చేయాల్సి ఉండగా.. అనారోగ్యం కారణంగా వాయిదా వేసుకున్నట్లు ప్రకటించారు. ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్నానని, త్వరలోనే పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేస్తానన్నారు. అయితే వైసీపీ నుంచి బెదిరింపులకు పాల్పడటంతో ఆయన వెనక్కి తగ్గారని, మరికొన్ని వర్గాల వారు విజయసాయిరెడ్డిని భయపెట్టడంతో మాజీ ఎంపీ వెనక్కి తగ్గారని ప్రచారం జరిగింది. అయితే తాను పార్టీ పెట్టడంలో వెనక్కి తగ్గేదిలేదని, తనను ఎవరూ బెదిరించలేదన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు కోసం కచ్చితంగా తన పోరాటం కొనసాగుతుందన్నారు.

# జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా

పులివెందుల,అక్టోబరు 21 : స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే టీడీపీ, వైసీపీలు రెండూ ఒకే బాట పయనిస్తున్నాయి. అరాచకాలలో ఒకరిని మించి మరొకరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ పాలనపై విమర్శలు చేసే చంద్రబాబు నేడు జరుగుతున్న పరిస్థితులను అవతలి వారిపైకి నెట్టడం సమర్థనీయం కాదు. ఎన్నికలంటే శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదు. ఇప్పుడు జరుగుతున్న, జరిగిన పరిణామాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా చేష్టలుడిగి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంత ఉదాసీన వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఇవే పరిస్థితులు తలెత్తక మానవన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు కూడా చేస్తున్నారు.రాజకీయాలు చూడండి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం అధికార పార్టీది, విపక్ష పార్టీది ఒకే దారి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు వైసీపీ బాధిత పార్టీగా కనిపించవచ్చు. కానీ అదే తమ పాలనలో జగన్ ప్రభుత్వం అవలంబించిన చర్యలేవిటి? అని చంద్రబాబు ప్రశ్న కూడా అందరూ ఆలోచించాల్సిన విషయమే. అలాగే ఇదే విమర్శ రేపు చంద్రబాబు కూడా ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చు. నాడు కుప్పం నియోజకవర్గంలో జగన్ చేసిన పని, నేడు పులివెందులలో టీడీపీ చేసింది. ఇందులో తప్పు వెతుక్కోవడానికి ఇద్దరిలోనూ వెతికినా కనిపించవు. కానీ జనం మాత్రం వీటిని గమనిస్తూనే ఉంటారన్న విషయాన్ని మాత్రం వైసీపీ, టీడీపీలు మర్చి పోకూడదు. ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించాలంటే రెండు పార్టీల అధినేతలు ఎవరికి వారే ఆత్మవిమర్శలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ, వైసీపీ లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించుకోవాలని సహజంగానే భావిస్తుంది. అదే సమయంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత బలోపేతం అయితే రానున్న సాధారణ ఎన్నికలకు పుంజుకుంటామని భావన కారణంగానే ఈ రకమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నది కాదనలేని వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అందులో తప్పులేదు. కానీ హింసా రాజకీయాలకు స్వస్తి పలకాలి. అనుభవమున్నచంద్రబాబు కు ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. ఒకరకంగా జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా? అన్న అనుమానం కూడా చాలా మంది సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ నామినేషన్ల



సందర్భంగానే చూశాం. ఇక జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఇంకెంత రగడ చూడాలో.. .దేవుడా ఏపీకి నీవే దిక్కు. అని అనుకోవడం తప్ప చేసేదేమీ లేదు

వ్యూహాలు ప్రతివ్యూహాలతో

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాచికలు పారినట్లు కనపడుతుందివైఎస్ మోహన్ రెడ్డి వ్యూహాలు ప్రతివ్యూహాలతో సర్వసన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంది. దీంతో తాడిపత్రి మున్సిపాలిటీ తప్పించి అన్నింటా వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు టీడీపీ పాలనపై వ్యతిరేకత తెచ్చేందుకు, తమ పార్టీపై సానుభూతి కురిసేందుకు జగన్ వేసిన వ్యూహం సక్సెస్ అయినట్లే కనపడుతుంది. ప్రతి చోట ఖచ్చితంగా నామినేషన్లు వేయాలని, ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వనని జగన్ నాడు చేసిన హెచ్చరికలను వేరే విధంగా చూసిన వారికి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతుంది. జగన్ తన ఎత్తుగడలో భాగంగనే నామినేషన్లు వేయించి అభ్యర్థులను బరిలోకి దిగితే శాంతిభద్రతలు అదుపు తప్పి టీడీపీ పాలనపై వ్యతిరేకత ఏర్పడుతుందని అంచనా నిజమవుతుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల పర్వం చూస్తేనే ఇది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.మ్యాప్‌లు చూడండి ప్రతి సీటులోనూ పోటీకి... గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా, ఈసారి ప్రతి స్థానంలోనూ వైసీపీ అభ్యర్థిని పోటీకి నిలపాలని జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అధికార కూటమికి ఏకగ్రీవాలు చేసుకునే అవకాశం ఇవ్వకూడదని, ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో ఏకగ్రీవమైతే దానికి స్థానిక నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు పూర్తయి ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో అధికారికంగా ప్రకటించినప్పటికీ... వైఎస్ జగన్ మాత్రం ఒక అడుగు ముందే వేసి మొదటి విడతగా 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. గ్రౌండ్ రిపోర్టుల ఆధారంగా ప్రజాదరణ కలిగిన బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ కొత్త ఎత్తుగడలతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సమాచారం చూడండి.. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం లేదా పోలీస్ వ్యవస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను, అక్రమాలను తట్టుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక లీగల్ సెల్స్, మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా అధికార దుర్వినియోగ ఘటనలు జరిగితే వాటిని రికార్డ్ చేయడానికి 'డిజిటల్ డైరీ' విధానాన్ని తీసుకువచ్చారు.ఈ స్థానిక ఎన్నికలను కేవలం ఒక పోటీలా కాకుండా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుండి తిరిగి బలోపేతం చేసుకునే ఒక ప్రక్రియగా జగన్ భావిస్తున్నారు. అందుకోసం రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు చూసి క్యాడర్ లోనూ కసి పెరుగుతుందని, అది తమకు వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేశారు. అనుకున్నట్లుగానే క్యాడర్ ఏకతాటిపైకి రావడంతో జగన్ పాచిక పారినట్లయింది. అధికార కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుని పటిష్ఠంగా ఉన్న నేపథ్యంలో, జగన్ ముందస్తు వ్యూహాలు మరియు ఒంటరి పోరాటం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓటర్లను ఆకర్షిస్తాయనే దానిపైనే ఆయన "పాచిక" సక్సెస్ ఆధారపడి ఉంటుంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటే అది తమకు కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు జగన్.

# ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం..

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర ) మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్‌కు చెందిన కూశనపెల్లి ప్రేమలతతిరుపతి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ కాపీని అందజేసిన మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు .ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ స్థానిక కార్పొరేటర్ కొంద్ర రాజేశ్వరి- లింగయ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

*పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీసులతో కలిసి ర్యాలీలో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు*



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 ( విజన్ ఆంధ్ర ) : పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వర్ధన్నపేట శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హనుమకొండలో నిర్వహించిన పోలీసు ర్యాలీలో పాల్గొని పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండ చౌరస్తా నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. విధి నిర్వహణలో భాగంగా దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పించి అమరులైన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. పోలీసు విధి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేయాల్సిన బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు సమాజం ఎల్లప్పుడూ అండగా నిలవాలని, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు పిలుపునిచ్చారు. దేశం కోసం, ప్రజల కోసం ప్రాణాలను అర్పించిన వీరుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలకు గౌరవం చాటారు.

## రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ రెఫరీగా డబ్బా వాసి దుర్గం సంజీవ్ ఎంపిక 'బి' గ్రేడ్‌తో అర్హత సాధించిన సంజీవ్




కాగజ్‌నగర్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమనేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన దుర్గం సంజీవ్ తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ న్యాయ నిర్ణేతగా ఎంపికయ్యారు. దుర్గం మొండయ్య, ఇందిర దంపతుల కుమారుడైన సంజీవ్ తన ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రెఫరీ క్లినిక్ నిర్వహించారు. ఈ క్లినిక్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది పాల్గొనగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి తొమ్మిది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షలు, ప్రతిభా పరిశీలనలో దుర్గం సంజీవ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి 'బి' గ్రేడ్‌తో అర్హత సాధించారు. దీంతో ఇకపై రాష్ట్ర స్థాయిలో నిర్వహించే హ్యాండ్‌బాల్ టోర్నమెంట్లలో రెఫరీగా విధులు నిర్వహించే అవకాశం ఆయనకు లభించింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన సంజీవ్ క్రీడారంగంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందడం పట్ల డబ్బా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన సాధించిన విజయంపై తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి శ్రీరాముడి బాణం బహూకరణ



హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 ( విజన్ ఆంధ్ర ): విజయదశమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఘనమైన రావణ వధ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ శ్రీరాముడి బాణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా విజయదశమి పర్వదినం సందర్భంగా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన రావణ వధ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయదశమి ఉత్సవ సమితి అధ్యక్షుడు రావుల సుదర్శన్, మాజీ శాసన సభ్యులు ధర్మారావు, ఎనుగుల రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దసరా సెలవుల అనంతరం సాంఘిక సంక్షేమ గురుకులాల పునఃప్రారంభం

*విద్యార్థులు నిర్ణీత తేదీల్లో తప్పనిసరిగా హాజరుకావాలి: హనుమకొండ డీసీవో పి.సుధాకృష్ణ*



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 ( విజన్ ఆంధ్ర ) : దసరా సెలవుల అనంతరం జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు, పాఠశాలలు పునఃప్రారంభం కానున్నట్లు హనుమకొండ జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ) పి. సుధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 22 నుండి అన్ని గురుకుల జూనియర్ కళాశాలలు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 23 నుండి అన్ని గురుకుల పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ, విద్యార్థులందరూ నిర్ణీత తేదీల్లో తప్పనిసరిగా తమ విద్యాసంస్థల్లో రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు. సెలవుల నిమిత్తం స్వగ్రామాలకు వెళ్లిన విద్యార్థులను సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు పంపించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు అవసరమైన దుస్తులు, పుస్తకాలు మరియు నిత్యావసర వస్తువులను సమకూర్చి, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని కూడా వెంటనే రప్పించి పాఠశాలలకు పంపాలని కోరారు. విద్యార్థి జీవితంలో ప్రతి రోజూ ఎంతో విలువైనది. ప్రతి పాఠం వారి భవిష్యత్తు విజయానికి బలమైన పునాదిగా మారుతుంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల సహకారం అత్యంత అవసరం అని ఆయన పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో విద్యార్థులందరూ విద్యాసంస్థల్లో హాజరయ్యేలా తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని డీసీవో విజ్ఞప్తి చేశారు.

# కల్వకుర్తిలో వైభవంగా వాసవి నవరాత్రి ఉత్సవాల ముగింపు

### శోభాయాత్రలో భక్తుల కోలాహలం హనుమాన్ ఆలయంతో పాటు కాలనీల్లో కొలువైన అమ్మవార్ల నిమజ్జనం





కల్వకుర్తి, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 11 రోజులుగా అంగరంగ వైభవంగా సాగిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. దేవాలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ముగింపు ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గత 11 రోజులుగా అమ్మవారిని ప్రతిరోజూ వివిధ అవతారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

**శోభాయాత్రలో సందడే సందడి:**

ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా వైభవంగా సాగింది. మహిళలు, పురుషులు కోలాటాలు, దాండియా ఆడుతూ, బతుకమ్మలతో సందడి చేస్తూ అమ్మవారికి భక్తిపూర్వకంగా స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, చిన్నారుల నృత్యాలు, బాణసంచా కాల్పులతో ఆలయ



పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ సవాలు, చీరల వేలం కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**కాలనీల్లో కొలువైన అమ్మవార్ల నిమజ్జనం:**

కన్యకా పరమేశ్వరి దేవాలయంతో పాటు పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో, వివిధ కాలనీల్లో యువకులు అమ్మవారి విగ్రహాలను కొలువుంచారు. దాదాపు 15 నుంచి 16 విగ్రహాలను ఏర్పాటు చేసి 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించి అమ్మవార్లను ఘనంగా నిమజ్జనం చేశారు. ముఖ్యంగా శిశు మందిర్ పాఠశాల ముందు ఏర్పాటు చేసిన అమ్మవారి దగ్గర కర్ణాటక నుండి వచ్చిన కళాబృందం ఖడ్గాలు వేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కొండూరు గోవర్ధన్, మండల అధ్యక్షుడు గంధం ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు శేఖర్, వాసవి క్లబ్, ఆవోపా సభ్యులు, దేవాలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## తెలకపల్లి లో మృతదేహంతో ఆందోళన



నాగర్ కర్నూలు జిల్లా, (ఫోటో జర్నలిస్ట్ మల్లేష్ బాబు) అక్టోబర్ 21 తెలకపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి బాల్ జంగయ్య, (దిమ్మయ్య) ఇంటి వద్ద గౌరెడ్డిపల్లి కి చెందిన శాంతయ్య మృతదేహంతో బాధితులు న్యాయం చేయాలంటూ నిరసన చేపట్టారు మూడు నెలల క్రితం బాల్ జంగయ్య, శాంతయ్య,ల, ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి ఈ సంఘటనలో శాంతయ్య తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు, ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు నిరసన చేపట్టారు.

## డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

ఎన్‌హెచ్ఎం (నేషనల్ హెల్త్ మిషన్) ఉద్యోగుల నిరసన కొనసాగుతోంది. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె 9వ రోజుకు చేరింది. హైదరాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్ఎం (నేషనల్ హెల్త్ మిషన్) ఉద్యోగుల నిరసన కొనసాగిస్తున్నారు. తెలంగాణలో రెగ్యులరైజేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హెల్త్ కార్డులతోపాటు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి ఎన్‌హెచ్ ఎం ఉద్యోగులు భారీ ఎత్తున తరలివచ్చారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చశారు. మరోవైపు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు నిరవధిక సమ్మె కొనసాగుతోంది. పండగ రోజు నల్లబ్యాడ్జీలు ధరించి.. గొడ్డు కారంతో భోజనం చేస్తూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలకు పిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# దేశ ప్రధానికి బెదిరింపులపై చర్యలు తీసుకోవాలి!

- **గురుపత్వంత్ సింగ్ పన్నును తక్షణమే అరెస్టు చేసి భారత్‌కు తీసుకురావాలి**
- **కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్‌లకు వినతిపత్రం అందజేస్తా: కొంపల్లి భూక్య శంకర్ నాయక్**

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై బెదిరింపులకు దిగుతూ, దేశ సమగ్రతకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నుపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొంపల్లి భూక్య శంకర్ నాయక్ డిమాండ్ చేశారు.

**విదేశాల నుంచి దేశ వ్యతిరేక కార్యకలాపాలు సహించరాదు**

పన్ను భారతదేశంలో నిరసన కార్యక్రమాల కోసం తొమ్మిది కోట్ల రూపాయలు ఇచ్చినట్లు ప్రకటించారని, ప్రధాని నరేంద్ర మోదీని హతమార్చాలంటూ, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలంటూ వ్యాఖ్యలు చేసినట్లు శంకర్ నాయక్ ఆరోపించారు. దేశంలో అశాంతిని సృష్టించేలా, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విదేశాల్లో ఉంటూ భారతదేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని చట్టపరంగా ఎదుర్కోవాలని పేర్కొన్నారు.

**కేంద్ర మంత్రులకు వినతిపత్రం**

ఈ అంశాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలో ఢిల్లీకి వెళ్లనున్నట్లు శంకర్ నాయక్ తెలిపారు. పన్నును చట్టప్రకారం అరెస్టు చేసి, అవసరమైన న్యాయ ప్రక్రియను అనుసరిస్తూ భారత్‌కు తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తానన్నారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.



**దేశ సమగ్రతను కాపాడాలి**

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ద్వారా ప్రధానిగా ఎన్నికైన నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వేర్పాటువాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని శంకర్ నాయక్ ఆరోపించారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండి, భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**రాజకీయ పరిణామాలపై విమర్శలు**

ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న నేపథ్యంలో, ఆ కార్యక్రమం వెనుక ఉన్న ఉద్దేశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని శంకర్ నాయక్ కోరారు. ప్రతిపక్షాల రాజకీయ కార్యక్రమాలను వేర్పాటువాద శక్తులతో ముడిపెడుతూ ఆయన పలు విమర్శలు చేశారు. దేశంలో అశాంతికి తావులేకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ, జాతీయ సమగ్రతకు విఘాతం కలిగించే ప్రయత్నాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శంకర్ నాయక్ పేర్కొన్నారు. పన్ను వ్యాఖ్యలపై సంబంధిత దర్యాప్తు సంస్థలు విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రాజకీయ పార్టీలకు జెన్ జీ భయం

హైదరాబాద్,అక్టోబరు 21 : తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెన్–జీ భయం రాజకీయా పార్టీలకు పట్టుకుంది. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు జెన్ జీ లు ఎవరికి మద్దతుగా నిలుస్తారన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జెన్ జీ ఉద్యమం ఎవరిని ముంచుతుందన్న ఆందోళనలోరాజకీయ పార్టీలున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలంటే కొత్తగా చేరిన యువత ఓట్లు ఎక్కువగా ఉంటాయి. దేశంలో ఇటీవల జెన్ జీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో మూడు ప్రధాన పార్టీలు భయాందోళనలో పడ్డాయి. యువత ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది ఈ ఎన్నికల్లో తేలిపోతుందన్నది ఆసక్తికరంగా మారింది. అనేక అంశాలు గెలుపోటములపై ప్రభావం చూపుతాయి. అందుకే రాజకీయ పార్టీలకు జెన్ జీ భయం పట్టుకుంది.. నిరుద్యోగ సమస్యలు ప్రధాన ప్రభావం చూపుతుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దాదాపు మూడు లక్షలకు పైగా కొత్త ఓటర్లు చేరే అవకాశం ఉండటంతో, వీరి మద్దతు ఎటు వైపు ఉంటుందనేది పార్టీల్లో ఉత్కంఠను రేపుతోంది. కొన్ని సర్వేల ప్రకారం... గ్రాడ్యుయేట్ ఓటర్లలో 31 శాతం మంది నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా పేర్కొన్నారు. జాబ్ నోటిఫికేషన్లు, ఉద్యోగాల భర్తీలో జాప్యం 24 శాతం వంటి అంశాలు కలిపి మొత్తం యాభై ఐదు శాతం వరకు ఉపాధి అంశాల చుట్టూనే చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పాలనపై ప్రజల, ముఖ్యంగా యువత అభిప్రాయానికి ఈ ఫలితాలను కొలమానంగా భావిస్తున్నారు. మూడు పార్టీల అభ్యర్థులు... కాంగ్రెస్ వేగంగా అభ్యర్థుల ఎంపిక మరియు ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టగా, బీజేపీ మరియు బీఆర్ఎస్ పార్టీలు కూడా ప్రత్యేక వ్యూహాలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. యువతలో ఉన్న అసంతృప్తిని ఎలా అధిగమించాలనేదానిపై పార్టీలు మథనపడుతున్నాయి. మరొకవైపు బీజేపీకి కూడా జెన్ జీ భయం పట్టుకుంది. దేశ వ్యాప్తంగా ఎన్నికల కమిషన్ వివిధ అంశాలపై ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో బీజేపీకి యువత హ్యాండ్ ఇస్తారన్న భయంలో బీజేపీ ఉంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు బీజేపీకి భయాన్ని కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ కూడా ఇదే పరిస్థితుల్లో ఉంది. బీఆర్ఎస్ యువతను ఆకట్టుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. గత పదేళ్ల పాలన ప్రభావం ఈ ఎన్నికల్లో చూపుతుందేమోనని కొంత బెరుకు కనపడుతుంది. మొత్తం మీద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెన్ జీ భయం అన్ని రాజకీయ పార్టీలకు వణుకు పుట్టిస్తోంది.

**రేవంత్ సర్కార్‌కు అసలు సిసలు అగ్నిపరీక్ష!**

. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనపై ప్రజలు,



ముఖ్యంగా విద్యావంతులైన పట్టభద్రుల నాడి ఎలా ఉందో అంచనా వేయడానికి ఈ ఎన్నికలు ఒక లిట్మస్ టెస్ట్ లా మారాయి. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాలలో దాదాపు మూడింట రెండొంతులు అంటే 77 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేసే ఈ రెండు పట్టభద్రుల నియోజకవర్గాల పోరు రసవత్తరంగా మారుతోంది.కార్మికులు, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో విజయం సాధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన పాలనకు ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉందని నిరూపించుకోవాలనుకుంటోంది. ఒకవేళ ఫలితాలు వ్యతిరేకంగా వస్తే, అది కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతుంది. అంతేకాకుండా బీఆర్ఎస్, బీజేపీలు దీనిని ప్రభుత్వ వ్యతిరేకతగా ప్రచారం చేసే అవకాశం ఉంది. అందుకే కాంగ్రెస్ నాయకత్వం దీన్ని కేవలం సాధారణ ఎన్నికగా చూడకుండా.. రాజకీయ మనుగడకు, పట్టు నిలుపుకోవడానికి అత్యంత కీలకమైన పోరుగా భావిస్తోంది.ఈ ఎన్నికల్లో ముందుగా అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ఒక అడుగు ముందుకేసింది. మహబూబ్ నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ స్థానం నుంచి సామ రామమోహన్ రెడ్డిని, వరంగల్– నల్గొండ– ఖమ్మం స్థానం నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని బరిలోకి దింపింది. సీఎం రేవంత్ రెడ్డికి స్వస్థలమైన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఈ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయన దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ రెండు స్థానాల్లో గెలుపు కాంగ్రెస్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.మరోవైపు.. ఈ ఎన్నికలు కేవలం అభ్యర్థుల సామర్థ్యంపైనా ఆధారపడవు. ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంస్థాగత బలానికి కూడా పెద్ద పరీక్షగా మారాయి. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ధన ప్రభావం గణనీయంగా ఉండేది. అధికార పార్టీ ఈసారి ప్రచారంలో ఏ చిన్న అవకాశాన్ని కూడా వదిలిపెట్టాలని భావించడం లేదు. ఓటర్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయడానికి ఆన్‌లైన్ సదుపాయాలతో పాటు, నేరుగా ఓటర్లను సంప్రదించే వ్యూహాలకు పదును పెట్టారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దామోదర రాజనర్సింహ తదితరులు వివిధ జిల్లాల్లో పార్టీ శ్రేణులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ సమన్వయం చేస్తున్నారు. అక్టోబర్ 23న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించి తుది ప్రచార వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు.ఇదిలా ఉంటే? బీఆర్ఎస్ కూడా ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంబంధిత జిల్లాల నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్న జోష్‌లో ఉన్న బీజేపీ కూడా తన పట్టును మరింత నిలుపుకోవాలని చూస్తోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సౌలభ్యం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఓటర్ల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో లేకపోవడం అన్ని ప్రధాన పార్టీలకు సవాలుగా మారింది. మొత్తానికి.. ఉత్కంఠ రేకెత్తిస్తున్న ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణలో ఎవరికి పట్టం కడతాయనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# ఎమ్మెల్సీ దండె విఠల్‌ను కలిసిన దివ్యాంగులు



కాగజ్‌నగర్, అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ దండె విఠల్ కార్యాలయంలో దివ్యాంగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు తమ సమస్యలను ఎమ్మెల్సీ దండె విఠల్‌కు వివరించి, వాటి పరిష్కారం కోసం వినతి పత్రాన్ని అందజేశారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయనకు తెలియజేస్తూ, తమకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. దివ్యాంగుల సమస్యలను ఎమ్మెల్సీ దండె విఠల్ సానుకూలంగా విన్నారు. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమం, వారికి అందాల్సిన ప్రభుత్వ పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వారు వివరించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. తమ సమస్యలను ఓపికగా విని, పరిష్కారానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్సీ దండె విఠల్‌కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అప్పయ్య......



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అప్పయ్య గారు రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెల్లంపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న రొటీన్ ఇమ్యునైజేషన్ (క్రమం తప్పకుండా నిర్వహించే టీకాల కార్యక్రమం)ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందుతున్నాయా, టీకాల కార్యక్రమం సక్రమంగా నిర్వహిస్తున్నారా అనే అంశాలను పర్యవేక్షించారు. అర్హులైన చిన్నారులందరికీ పూర్తిస్థాయిలో టీకాలు అందేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం త్వరలో ప్రారంభించనున్న నూతన నడికూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని తరలించే ప్రక్రియను పరిశీలించారు. నూతన ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అప్పయ్య తెలిపారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు నిరంతరాయంగా అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సిబ్బంది సమన్వయంతో సేవలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, టీకాల కార్యక్రమంతో పాటు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు.

## అమరవీరుల కుటుంబాలకు భరోసా

### - కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 21(విజన్ఆంధ్ర) : విధి నిర్వహణలో దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం - అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా ఉంటాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. విధి నిర్వహణలో దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీసు ఫ్లాగ్ డే) సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్రతో కలిసి కలెక్టర్ పుష్పగుచ్ఛాలు సమర్పించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, దేశ అంతర్గత భద్రతలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారు చూపిన ధైర్యం, కర్తవ్యనిష్ఠ, సేవాభావాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అమరులయ్యారని గుర్తుచేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఎదురైతే ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించే సంస్మరణ కార్యక్రమాలు సమాజంలో దేశభక్తి, సేవాభావం, విధి పట్ల నిబద్ధతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నర్సింహారెడ్డి, డీఎస్పీలు ఎస్. మధుసూదన్, పి. విఠల్ రెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, గట్టుమల్లు, ఉదయ్ భాస్కర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి - ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 21 (విజన్ఆంధ్ర) : కామారెడ్డి పట్టణంలో షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా విజయదశమి వేడుకలు కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి, మాజీ ప్రతిపక్ష నేత మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు.

- ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ..

కామారెడ్డి పట్టణంలో గత 36 సంవత్సరాలుగా షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా కలిసిమెలిసి పండుగలను జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కరోనా మహమ్మారి ప్రభావం, ఇతర పరిస్థితుల కారణంగా గత ఐదేళ్లుగా దసరా ఉత్సవాలను నిర్వహించలేకపోయామని తెలిపారు. ఐదేళ్ల విరామం తర్వాత తిరిగి కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, సహకారం ఈ ఉత్సవాల విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి, విజయదశమి పండుగ చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అని మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ ప్రజల్లో ధైర్యం, విశ్వాసం, న్యాయం, ధర్మం పట్ల నిబద్ధతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడుస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. దసరా పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇలాంటి పండుగలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని గంగా జమునా తెహజీబ్ సంప్రదాయానికి అనుగుణంగా అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో పండుగలను జరుపుకోవడం మన సమాజ ప్రత్యేకత అని పేర్కొన్నారు.

- ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాం

విజయదశమి సందర్భంగా అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు షబ్బీర్ అలీ తెలిపారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కామారెడ్డి పట్టణ ప్రజలందరూ ఐకమత్యంతో ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు నిండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో భవిష్యత్తులోనూ ఇలాంటి సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తూ మన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# అంబరాన్నంటిన దసరా సంబురాలు



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :21(విజన్ ఆంధ్ర ) : సంగారెడ్డిలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏటా అంబేద్కర్ స్టేడియం వేదికగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా వేడుకలు ఈసారి కూడా అత్యంత వైభవంగా సాగాయి. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక భజన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రామమందిరం భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శావను తీసుకుని రామమందిరం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. వేదికపై మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా జమ్మిపూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రావణ దహన కార్యక్రమం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీగా తరలివచ్చిన ప్రజలు రావణ దహనాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆకాశంలో వెలుగులు విరజిమ్మిన బాణసంచా మెరుపులు, ఆకట్టుకునే డ్రోన్ల ప్రదర్శన ప్రేక్షకులను కనువిందు చేశాయి. ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహుతులను మంత్ర ముగ్ధులను చేసింది.

సంగారెడ్డి ప్రజలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని, సంగారెడ్డి ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నా దగ్గర చాలా డబ్బులు ఉన్నాయని అందరూ అనుకుంటారు. కానీ నాకు వచ్చిన డబ్బును ప్రతి ఏటా సంగారెడ్డి ప్రజల కోసం పండుగలు నిర్వహించడానికి ఖర్చు చేస్తున్నాను. నలభై ఏళ్ల క్రితం చిన్న వయసులో ఉన్నప్పుడు ఇదే మైదానంలో నా స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నాను. ఆనాటి నుంచి ఈనాటి వరకు సంగారెడ్డితో నా అనుబంధం కొనసాగుతోంది. నన్ను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకొచ్చింది సంగారెడ్డి ప్రజలే" అని పేర్కొన్నారు.

దసరా వేదికను తాను ఎన్నడూ రాజకీయాల కోసం ఉపయోగించుకోలేదన్నారు. "ఈ వేదికపై నుంచి నేను ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడలేదు. ఓట్లు అడగలేదు. కానీ నా మనసులో ఉన్న మాటలను మాత్రం ప్రజలతో పంచుకుంటాను" అని చెప్పారు. సంగారెడ్డి ప్రజలంతా నా కుటుంబమే "కుటుంబం అంటే కేవలం నా భార్య, పిల్లలు మాత్రమే కాదు. సంగారెడ్డి ప్రజలందరినీ నా కుటుంబ సభ్యులుగానే భావిస్తాను. అందుకే ప్రతి ఏటా అందరితో కలిసి పండుగలు జరుపుకుంటాను" అని జగ్గారెడ్డి అన్నారు. వయసు పెరిగేకొద్దీ తల్లిదండ్రుల ఆరోగ్యంపై పిల్లలు మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పెద్దలు వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా చూడాలన్నారు. ఇంట్లో పెద్దల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, వారికి అవసరమైన సంరక్షణ అందించాలని కోరారు. కొడుకులు, కుమార్తెలతో పాటు కోడళ్లు కూడా కుటుంబంలోని పెద్దల ఆరోగ్యంపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కాళ్లు, చేతులు పడిపోయిన తర్వాత ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా ప్రయోజనం లేదన్నారు. పండుగలంటే కేవలం ఆటపాటలు, వినోదం మాత్రమే కాదని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పెంపొందించుకునే సందర్భాలని ఆయన వ్యాఖ్యల ద్వారా సందేశమిచ్చారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబ బంధాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ జగ్గారెడ్డి చేసిన ప్రసంగం దసరా వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**- సంస్మరణ దినోత్సవం లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**- ఎస్పీ పరితోష్ పంకజ్**

**-విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు ఘన నివాళులు**



సంగారెడ్డి బ్యూరో , అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర ) : శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. విధి నిర్వహణలో భాగంగా సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ తో కలిసి పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో పోలీసులు అనునిత్యం నిమగ్నమై ఉంటారని, ఈ క్రమంలో ఎదురయ్యే అనేక సవాళ్లను తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ఎదుర్కొంటారని అన్నారు. నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు జంగయ్య (సిర్గాపూర్ పోలీస్ స్టేషన్), ఎల్లయ్య (సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్), సత్యనారాయణ (జిన్నారం పోలీస్ స్టేషన్), సురేష్ (కంగ్టి పోలీస్ స్టేషన్) ప్రజల రక్షణ కోసం చేసిన వారి ధైర్య సాహసాలను, సేవలను కొనియాడారు. పోలీస్ అమరుల కుటుంబాలకు ప్రభుత్వం జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో ఎంతోమంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన జంగయ్య, ఎల్లయ్య, సత్యనారాయణ, సురేష్ ప్రజల రక్షణ కోసం చేసిన ప్రాణత్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎస్పీ అన్నారు . వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీసు సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల రక్షణతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని కల్పించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యమని, అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజల రక్షణకు అంకితభావంతో పనిచేయాలని ఎస్పి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో విధినిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబీకులకు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి చైతన్య రెడ్డి, డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు భారీ షాక్.. కాంగ్రెస్‌లోకి యువ నాయకుడు సల్లకొండ శ్రీకాంత్



కాగజ్‌నగర్: అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ సల్లగొండ భాగ్యలక్ష్మి కుమారుడు, యువ నాయకుడు సల్లకొండ శ్రీకాంత్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈ చేరికలు జరిగాయి. సల్లకొండ శ్రీకాంత్‌తో పాటు మాజీ కౌన్సిలర్ ఎల్లేష్, యువ నాయకుడు ఎన్నం శ్రీకాంత్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్సీ దండె విఠల్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువ నాయకులు కాంగ్రెస్‌లో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి. కాగజ్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులకు కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికాయి. ఈ చేరికలతో స్థానిక రాజకీయాల్లో చర్చ మొదలైంది. యువ నాయకులు కాంగ్రెస్ వైపు అడుగులు వేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వినోదానికి కొత్త శోభ

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21:(విజన్ ఆంధ్ర) : అసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో ప్రజలకు ఆహ్లాదకరమైన వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో పిక్చర్ టైమ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమన్వయంతో గాలి బుడగల నిర్మాణంతో రూపొందించిన ఆధునిక సినిమా థియేటర్‌ను పునః ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గాలి బుడగల థియేటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన వినోద సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని, మహిళా సంఘాల సహకారం, సమన్వయంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. పిక్చర్ టైమ్ సినిమా థియేటర్‌లో పుష్‌బ్యాక్ సీట్లు, ఎయిర్ కండిషనింగ్, డాల్బీ సౌండ్ వంటి ఆధునిక సదుపాయాలతో పాటు ఆహార పదార్థాలు, పానీయాలు అందుబాటులో ఉంటాయని, జిల్లా ప్రజలు, యువత, కుటుంబాలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రజలకు వినోదంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం సానుకూల పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు నీటి హక్కుల కోసం ప్లకార్డుతో నిరసన సీఎం దృష్టికి ఎర్రవల్లి సమస్య

**- దసరా వేడుకల్లో కొండారెడ్డిపల్లికి వచ్చిన ముఖ్యమంత్రికి యువ నాయకుడి విజ్ఞప్తి**






తెలంగాణ స్టేట్ బ్యూరో, వంగూరు,అక్టోబర్ 21, (విజన్ ఆంధ్ర): దసరా పండుగ సందర్భంగా తన స్వగ్రామం కొండారెడ్డిపల్లికి వచ్చిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, స్థానిక యువ నాయకుడు చీమర్ల అర్జున్ రెడ్డి ప్లకార్డు ద్వారా తన ప్రాంత సమస్యను ప్రజాస్వామ్యబద్ధంగా విన్నవించుకున్నారు. సీఎం ఓపెన్ టాప్ జీపులో గ్రామస్తులకు అభివాదం చేస్తూ వెళ్తున్న సమయంలో, అర్జున్ రెడ్డి పాలమూరు ప్రాంత సాగునీటి అంశాలను ప్రస్తావిస్తూ ప్లకార్డు ప్రదర్శించి నిరసన తెలిపాడు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి, ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల రైతులకు సాగునీరు అందించాలని, అదే విధంగా డిండి ఎత్తిపోతల పథకం విషయంలో ఎర్రవల్లి గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, ఆ గ్రామాన్ని పరిరక్షించాలని ఆయన తన వినతిలో పేర్కొన్నారు. తాను ఎలాంటి రాజకీయ దురుద్దేశంతో ఈ కార్యక్రమం చేయలేదని, కేవలం తన ప్రాంతం, గ్రామ ప్రజల భవిష్యత్తు కోసం, రైతుల బాగోగుల కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశానని అర్జున్ రెడ్డి తెలిపారు. పాలమూరు బిడ్డగా సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాంత నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తారని, తనకు నమ్మకం ఉందని, ప్రజాస్వామ్యంలో తన గొంతును వినిపించడం తన బాధ్యతగా భావించానని ఆయన అన్నారు. మన ప్రాంతానికి నీరు అందాలి, మన గ్రామాలు బాగుండాలి అనే ఆకాంక్షతోనే ఈ నిరసన తెలిపానని వివరించారు.

# కుత్బుల్లాపూర్‌లో ఘనంగా బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కే.పి వివేకానంద్ జన్మదిన వేడుకలు

**- పేట్‌బషీరాబాద్ క్యాంపు కార్యాలయానికి పోటెత్తిన అభిమానులు**

**- పుష్పగుచ్ఛాలు, శాలువాలతో కేపీ వివేకానంద్‌కు సత్కారం**

**- పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులు**





కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదిన వేడుకలు బుధవారం పేట్‌బషీరా బాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దీంతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, వివిధ అనుబంధ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువాలతో సత్కరించి తమ అభిమానం చాటుకున్నారు. పలువురు ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు అందించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావడంతో క్యాంపు కార్యాలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. నాయకులు, కార్యకర్తల సందడి మధ్య వేడుకలు ఘనంగా సాగాయి.

# పురావస్తు శాఖ చట్టాలపై పార్లమెంట్ లో ప్రశ్న లేవనేత్తా లని ఏం. పీ. కి విజ్ఞప్తి




ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 21:- భారతదేశం లోని పురావస్తు శాఖ పురాతన కట్టడాల మరమ్మత్తుల విషయంలో పార్లమెంట్ చట్టసభలో ప్రశ్న లేవనేత్తాలని కోరుతూ అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి నిజామా బాద్ పార్లమెంట్ సభ్యులైన ధర్మపురి అరవింద్ ను బుధవారం రోజు విజ్ఞప్తి చేశారు.ఇందుకు సంబంధించి న వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా అల్లకొండ ఖిల్లా 1059 లో అల్లయ్య కొండయ్య హయాంలో అల్లకొండ ఊరు నిర్మితమైందని పురాతన కట్టడాలను మరమ్మత్తులు చేయాలంటే పాత చట్టాలు అడ్డు వస్తున్నాయని పురావస్తు శాఖ అధికారులు అంటున్నారని దీంతో అనేక పూర్వ కట్టాడాలు శిథిలావస్థలో ఉన్నాయని, పురాతన కట్టడాలు పాత చట్టాల సవరణ పార్లమెంట్ లోనే సవరణ చేస్తే దేశంలోని పురాతన కట్టడాలు మరమ్మత్తులు చేయడమే కాకుండా పురాతన కట్టడాలు భావితరాల వారికి చరిత్ర గురించి తెలుస్తూశీదని,వచ్చే పార్లమెంటు సమావేశంలో ఈ విషయంపై ప్రశ్న లేవ నేత్తాలని ఏం.పీ గారికి అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి కార్యనిర్వా హక అధ్యక్షులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు కార్యదర్శి డాక్టర్ పవన్ కుమార్, బ్రాహ్మణపల్లి జగదీశ్వర్ సూత్రావే సంతోష్ కుమార్ మరియు తెలంగాణ ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు బిజెపి నాయకులు అబ్బగోని అశోక్ గౌడ్ ఎంపీ విజ్ఞప్తి చేశారు.

*స్పందించిన ఎంపీ*

భావితరాల వారికి పురాతన కట్టడాల రక్షణ కోసం పూర్వ ప్రభుత్వాలు తెచ్చిన పాత చట్టాలపై పార్లమెంట్లోప్రశ్న లేవ నేత్తుతానని ధర్మపురి అరవింద్ హామీ ఇవ్వడమె కాకుండా ఈ విషయాన్ని పార్లమెంట్ లో "ప్రశ్న నోట్" తయారు చేయాలని ఎం.పీ. అధికార కార్యదర్శి కి ఆదేశాలు జారీ చేయడం విశేషం.

# భూపాలపల్లిలో ఘనంగా పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం

## అమరవీరులకు ఘన నివాళులు.. స్మృతి పరేడ్, రక్తదాన శిబిరం నిర్వహించారు.

భూప్‌గలపల్లిజిల్లా 21 అక్టోబర్ విజన్ ఆంధ్ర : భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ స్మృతి పరేడ్ నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 155 మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు ఎస్పీ నరేష్ కుమార్ చదివి వినిపించారు. అనంతరం అమరవీరులకు గౌరవ వందనం సమర్పించి, పుష్పాంజలి ఘటించారు.అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ మాట్లాడుతూ, దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది



మరింత నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.పోలీసుల సేవలు సమాజానికి ఎంతో కీలకం కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గారు మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని అన్నారు. దేశం, సమాజం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని పేర్కొన్నారు.ప్రజల భద్రత కోసం పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. ఎమ్మెల్యే మాట్లాడుతూ,.... ప్రజల భద్రత కోసం పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుంది కార్యక్రమానికి హాజరైన పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రక్తదాన శిబిరం ప్రారంభం...అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రారంభించారు. అమరవీరుల సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పోలీసులు ముందుండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, రెహమాన్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీస్ సంఘం అధ్యక్షుడు నరేష్, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారు చూపిన సేవా మార్గంలో నడుస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని పోలీస్ అధికారులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# పోలీసు అమరులకు ఘన నివాళి

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 ( విజన్ ఆంధ్ర ): అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్ క్వార్టర్ లోని అమరుల స్తూపం వద్ద హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు మరియు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ గారు పోలీసు అమరులను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్ గార్లు, అమరవీరుల కుటుంబ సభ్యులు,అధికారులు ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా , వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆదేవిదంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధినిర్వహణలో ఇప్పటివరకు 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరచిపోలేనివని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులందరికీ ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు గౌరవాభివందనాలు తెలియజేశారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అమరుల కుటుంబ సభ్యులతో కలిసి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు, అమరుల కుటుంబాల సంక్షేమం కోసం పోలీస్ శాఖ కట్టుబడి ఉన్నదని కమిషనర్ గారు తెలిపారు, ప్రభుత్వంతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిపి గారు అమరుల కుటుంబాలకు గిఫ్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అడిషనల్ డిసిపి పరిపాలన రాయల ప్రభాకర్ రావు, మిగతా అడిషనల్ డిసిపిలు బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు వాళ్ళు చేసిన సేవలు చిరస్మనీయం

**జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా అమరవీరుల సంస్కరణ దినోత్సవ వేడుకలు**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపిఎస్**



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): అక్టోబర్ 21పోలీస్ పరేడ్ మైదానంలో బుధవారం సంస్కరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపిఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగురవేసి అమరవీరుల స్థూపం వద్ద వారికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పోలీస్ మైదానం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ర్యాలీని నిర్వహించారు.ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ . ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీని మనం 'పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం' (గ్రాశీశ్రీఅఎవ జశీఎవవశీతీఫ్ఆశీఅ ఖఎ) గా జరుపుకుంటూ, దేశం కోసం, ప్రజల ప్రాణాల రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన సాహస పోలీసు అధికారులను, సిబ్బందిని స్మరించుకుంటున్నాం. 1959వ సంవత్సరం అక్టోబర్ 21న లడఖ్‌లోని 'హాట్ స్ప్రింగ్స్' ప్రాంతంలో చైనా దళాలు జరిపిన మెరుపు దాడిలో మన దేశానికి చెందిన 10 మంది వీర జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. దేశ సరిహద్దుల రక్షణలో ప్రాణాలర్పించిన ఆ పోలీసు యోధుల త్యాగానికి గుర్తుగా, అలాగే దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన ప్రతి పోలీసు అమరవీరుడికి నివాళిగా ప్రతీ ఏటా ఈ రోజును అమరవీరుల సంస్కరణ దినోత్సవం గా జరుపుకుంటున్నాం. శాంతిభద్రతల పరిరక్షణ, ఉగ్రవాద అణచివేత, నేరాల నిరోధం, విపత్తుల వేళ ప్రజలను ఆదుకోవడం వంటి ఎన్నో క్లిష్టమైన సందర్భాల్లో పోలీసులు ముందుంటారు. పగలు, రాత్రి, ఎండ, వాన అనకుండా తమ కుటుంబాలను, వ్యక్తిగత సుఖాలను పణంగా పెట్టి ప్రజల రక్షణే ధ్యేయంగా వారు పనిచేస్తారు. ఈ ప్రయాణంలో కొందరు తమ ప్రాణాలనుకోల్పోతుంటారు. వారు చూపిన తెగువ, త్యాగం మనందరికీ ఎప్పుడూస్ఫూర్తిదాయకం.మన జిల్లాలో1993 నవంబర్ 14 సోమశిల లో జరిగిన దుర్ఘటనలో అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ పరదేశి నాయుడు ఐపిఎస్,

2. కిషోర్ కుమార్( ఎస్సై )
3. శివ ప్రసాద్ ( ఎస్సై )
4. రంగారెడ్డి( హెడ్ కానిస్టేబుల్ )
5. ఎన్ ప్రసాద్ ( కానిస్టేబుల్)
6.సుభాన్ ( కానిస్టేబుల్)
7. జహబ్ ఇక్బాల్ ( కానిస్టేబుల్)
8. జయ రాములు( కానిస్టేబుల్)
9.షైక్ హైదర్ ( కానిస్టేబుల్) లు

మావోయిస్టుల చేతిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని వారి కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ తోడుగా అండగా ఉంటుందని తెలిపారు.నేడు మనం స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవిస్తున్నామంటే, దానికి కారణం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ఆ అమరవీరుల త్యాగమే. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, ప్రజలకు మరింత మెరుగైన, భద్రమైన సేవలను అందించడమే వారికి మనం అర్పించే నిజమైన నివాళి. ఈరోజు మన మధ్య లేకపోయినా, వారి స్మృతులు మనల్ని నిరంతరం కర్తవ్యపథంలో నడిపిస్తాయని నమ్ముతూ...

**వీర జవాన్లకు, పోలీసు అమరవీరులకు జోహార్లు!**

అనంతరం నాగర్ కర్నూల్ ఎస్పీ ఆఫీస్ ముందు ఏర్పాటు చేసినటువంటి అమరవీరుల స్తూపం దగ్గర అమరవీరుల యొక్క కుటుంబాల తోటి గ్రూప్ ఫోటో దిగడం జరిగింది... ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు మరియు ఆర్ముడు రిజర్వ్ సిబ్బంది తో పాటు పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు చిన్ను నాయక్ పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం - వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 ( విజన్ ఆంధ్ర ): అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్ క్వార్టర్ లోని అమరుల స్తూపం వద్ద హనుమకొండ,వరంగల్ జిల్లాల కలెక్టర్లు మరియు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ పోలీసు అమరులను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్ లు , అమరవీరుల కుటుంబ సభ్యులు,అధికారులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా , వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.



ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆదేవిదంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధినిర్వహణ లో ఇప్పటివరకు 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరచిపోలేనివని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులందరికీ ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు గౌరవాభివందనాలు తెలియజేశారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అమరుల కుటుంబ సభ్యులతో కలిసి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు, అమరుల కుటుంబాల సంక్షేమం కోసం పోలీస్ శాఖ కట్టుబడి ఉన్నదని కమిషనర్ గారు తెలిపారు, ప్రభుత్వంతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిపి గారు అమరుల కుటుంబాలకు గిఫ్టులు అందజేశారు..ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అడిషనల్ డిసిపి పరిపాలన రాయల ప్రభాకర్ రావు, మిగతా అడిషనల్ డిసిపిలు బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నాగవరం ప్రీమియర్ లీగ్ సీజన్-3 విజేత 'స్కై 11' జట్టు

- ఆనందోత్సవాల మధ్య ముగిసిన విజయదశమి క్రికెట్ టోర్నమెంట్
- బహుమతులు ప్రధానం చేసిన సీనియర్ జర్నలిస్ట్ బాలస్వామి మల్యాల





వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగవరం గ్రామంలో నిర్వహించిన 'నాగవరం ప్రీమియర్ లీగ్ (ఎన్పీఎల్) సీజన్-3' క్రికెట్ టోర్నమెంట్ అత్యంత ఆనందోత్సవాల మధ్య ముగిసింది. ఈ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించినట్లు ఆర్గనైజర్లు యాదగిరి, శ్రీకాంత్, రాఘవేందర్, శేఖర్, అభిలాష్, భాస్కర్ వెల్లడించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో 'స్కై 11' జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలిచింది మరియు టోర్నీ ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేతలకు అందజేసిన నగదు బహుమతితో పాటు ట్రోఫీని నీరజ్ ముదిరాజ్ ప్రత్యేకంగా స్పాన్సర్ చేశారు.

ఘనంగా బహుమతుల ప్రధానోత్సవం

టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ జర్నలిస్ట్ బాలస్వామి మల్యాల విజేతలకు బహుమతులు, ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన టోర్నీలో గెలుపొందిన విజేతలను అభినందించడమే కాకుండా, రన్నరప్ జట్లకు 'బెస్ట్ ఆఫ్ లక్' చెప్పి మరింత ప్రోత్సహించారు.ట్రోఫీ ప్రదాత నీరజ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. క్రీడాకారులు ఐక్యతతో మెరుగైన నైపుణ్యాన్ని ప్రదర్శించాలని, నిరంతరం సాధన చేస్తూ గ్రామస్థాయిలో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడోత్సవాలను భవిష్యత్తులోనూ మరింత ప్రోత్సహిస్తామని భరోసానిచ్చారు. ఈ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నీరజ్ ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, గోపాల్‌తో పాటు టోర్నమెంట్ ఆర్గనైజర్లు, క్రీడాకారులు, పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాస్థాయి భజన పోటీల కరపత్రం ఆవిష్కరణ

- అక్టోబర్ 31న ఘనంగా భజన పోటీల నిర్వహణ
- వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) వనపర్తి జిల్లా కేంద్రంలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి భజన పోటీల కరపత్రాన్ని గురువారం వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ రఘురామ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అక్టోబర్ 31, 2026 (శనివారం) మధ్యాహ్నం 12:00 గంటల నుండి రాత్రి 9:30 గంటల వరకు ఈ భజన పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించబడునున్నట్లు తెలిపారు. భక్తి భావాన్ని పెంపొందించేలా చేపడుతున్న ఈ వేడుకల్లో భక్తులు, భజన మండళ్ల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో టీ. వెంకట్రములు, వై. బాల్‌రెడ్డి, భాస్కరాచారి, చెన్నయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ గీతాంజలి హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ములుగు అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా కేంద్రంలోని ముకుంద కన్వెన్షన్ సెంటర్ లో శ్రీ గీతాంజలి హైస్కూల్ 2008-2009 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 17 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న సహచర విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు తమ ప్రస్తుత జీవన ప్రయాణాన్ని, అనుభవాలను పంచుకున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించుకున్నారు.

# సుభాష్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు.



ములుగు అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లా కేంద్రంలో సుభాష్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మంగళవారం దుర్గాదేవి విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించి తోపుకుంటలో నిమజ్జనం చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

# జంపన్న వాగు కరకట్ట వద్ద మొక్కలు నాటిన సర్పంచ్



ఏటూరునాగారం అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో జంపన్న వాగు కరకట్ట వద్ద పర్యావరణ పరిరక్షణలో భాగంగా బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు పూజలు నిర్వహించి మొక్కలు నాటారు. కరకట్ట పరిరక్షణకు, పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రదీప్ బాబు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ దేశం కోసం, ధర్మం కోసం నిలబడాలి

- ధర్మం, విలువలు, దేశభక్తితో కూడిన విద్య అవసరం.
- రాజకీయ పార్టీలు మారాలి.
- విద్యాభారతి అఖిల భారత ప్రచార ప్రముఖ్ లింగం సుధాకర్ రెడ్డి.











ములుగు అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర ప్రతినిధి : దేశ పౌరులందరూ దేశం కోసం, ధర్మం కోసం నిలబడాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, విద్యాభారతి అఖిల భారత ప్రచార ప్రముఖ్ లింగం సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. హిందువుల్లో చైతన్యం సన్నగిల్లిందని, రాజకీయ పార్టీల నేతలు సంతుష్టీకరణ విధానాలను విడనాడాలని అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ధర్మ జాగరణ ఉత్సవ సమితి అధ్యక్షుడు గండ్రకోట కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని సాధన ఉన్నత పాఠశాల సమీపంలోని గ్రౌండ్ లో 26వ రావణాసుర వధ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అబ్బురపరిచే ఫైర్ వర్క్స్, మిమిక్రీ, సాంస్కృతిక, జానపద కళాకారుల విన్యాసాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమానికి 100 మంది శాశ్వత సభ్యులతో పాటు ముఖ్య అతిథిగా లింగం సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. పర స్త్రీపై వ్యామోహం వల్లే రావణుడు శ్రీరాముడి చేతిలో వధించబడ్డాడని, అధర్మంపై ధర్మం గెలిచిన రోజుగా విజయదశమిని జరుపుకుంటారని పేర్కొన్నారు. దసరా పండుగను కేవలం వేడుకగా కాకుండా శ్రీరాముడి ఆదర్శాలను ఆచరించే సందర్భంగా భావించాలని అన్నారు.

***విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి:***

విద్య ఉద్దేశం కేవలం డబ్బు సంపాదించడం, ఉద్యోగాలు పొందడం మాత్రమే కాదని, దేశానికి, సమాజానికి ఉపయోగపడే పౌరులను తయారు చేయడమే లక్ష్యమని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల్లో నైతిక విలువలు, బాధ్యత, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని కోరారు. చిన్నారులు సహజంగా అనేక ప్రశ్నలు అడుగుతారని, వారిని నోరు మూయించడం వల్ల ఆలోచనా సామర్థ్యం దెబ్బతింటుందని, ఓపికగా సమాధానాలు చెప్పి జిజ్ఞాసను పెంపొందించాలని సూచించారు. నూతన విద్యా విధానం కూడా ఆలోచనా శక్తిని పెంచడంపై దృష్టి సారిస్తోందని తెలిపారు.

శ్రీరాముడి చరిత్ర కుటుంబ బంధాలను తెలుపుతుంది:

రాముడు తండ్రి మాటను గౌరవించి 14 ఏళ్లు అరణ్యవాసానికి వెళ్లడం, సీతమ్మ వెంట వెళ్లడం, లక్ష్మణుడు అన్నకు తోడుగా నిలవడం త్యాగం, కుటుంబ అనుబంధానికి నిదర్శనమని అన్నారు. రావణ పతనానికి అహంకారం, పర స్త్రీపై మోజే కారణమని, స్త్రీలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో ముఖ్యమని తెలిపారు. రామాయణ, మహాభారత, భగవద్గీతలు కేవలం కథలు కాదని, జీవన విలువలను నేర్పే గ్రంథాలని అన్నారు.

***రాజకీయ పార్టీల తీరు మారాలి:***

రాజకీయ పార్టీలు కులాలు, మతాల పేరుతో విభజించే సంస్కృతిని విడనాడాలని, రాజకీయ విభేదాలు సమాజంలో శాశ్వత చీలికలకు కారణం కాకూడదని అన్నారు. పార్టీలకు అతీతంగా దేశం, సంస్కృతి, సామాజిక ఐక్యతను కాపాడుకోవాలని, తప్పు జరిగితే ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండాలని సూచించారు. విదేశీ శక్తుల జోక్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విదేశాల్లో చదువుకునే విద్యార్థులు కూడా దేశభక్తిని మరువవద్దని అన్నారు.

రావణ దహనం: అనంతరం రావణాసుర విగ్రహ దహనాన్ని లింగం సుధాకర్ రెడ్డి, ఎస్హెచ్ఓ ఎస్సై వెంకటేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్ కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు చంద్రశేఖర్, సుచరిత, శాశ్వత కమిటీ సభ్యులు అడ్వకేట్ చలుమల్ల రాజేందర్, అనుముల సురేష్, వాంకుడోత్ జ్యోతి, ఆడెపు రాజు, తుమ్మ అమర్నాథ్, సకినాల జీవన్ చంద్ర, నేతావత్ సుధాకర్, ఆవుల వెంకన్న, ఇమ్మడి రాము యాదవ్, అనుముల సిద్దు, పెట్టెం రాజు, దరువుల అజయ్, శ్రీరాముల విష్ణు, సోనవేని కుమార్, కొడెపాక మహేందర్, మేకల సంపత్, కొత్త రాజకుమార్, ఇట్ట వేన రాజు యాదవ్, బండి శ్రీకాంత్, పోరిక రాహుల్ నాయక్, పోరిక విజయ్, మాలోతు ప్రేమ్ సింగ్, బోనాల శ్రీనాథ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

- ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరులకు ఘన నివాళులు
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్, అక్టోబర్ 21:(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లప్పుడూ వారికి రుణపడి ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారని, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. నిత్యం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అమరవీరుల త్యాగాలు వృథా కాకుండా, వారి స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సైబర్ నేరాలను సమర్థవంతంగా ఛేదించి నేరస్థులను పట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, నేరాల నియంత్రణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 14 మంది పోలీసులు సంఘ విద్రోహ శక్తుల చేతుల్లో ప్రాణత్యాగం చేసి అమరులయ్యారని తెలిపారు. వారు ప్రజల రక్షణ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అమరవీరుల ప్రాణత్యాగాల ఫలితంగానే ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారని అన్నారు. దేశ సమగ్రత, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజలకు భరోసా కల్పించడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యత అన్నారు. అమరుల కుటుంబాలు చేసిన త్యాగాలను కూడా సమాజం గుర్తించాలని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబాలకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు గిఫ్ట్ ప్యాక్‌లను అందజేసి వారి త్యాగాలను గౌరవించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ జమ్ములమ్మ ఆలయం దారిలో అష్టాదశ శక్తిపీఠాలు నిర్మాణం పూర్తి ఎప్పుడో.. ?

### నిర్మాణాలు పూర్తయితే జమ్ములమ్మ బ్రహ్మోత్సవాలకు మరింత శోభ..

### దక్షిణ తెలంగాణలోనే ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రంగా జమ్మిచేడు శ్రీ జమ్ములమ్మ





గద్వాల అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి మాత్రమే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల భక్తులచే కొలువబడుతున్న జమ్మిచేడు శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ దేవి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్తర తెలంగాణలో సమ్మక్కసారలమ్మ జాతర ఎంతటి ప్రాధాన్యతను సంతరించుకుందో, దక్షిణ తెలంగాణలో శ్రీ జమ్ములమ్మ జాతర, బ్రహ్మోత్సవాలు కూడా అంతటి వైభవాన్ని సంతరించుకోవాలన్నది భక్తుల ఆకాంక్ష. ఈ నేపథ్యంలో శ్రీ జమ్ములమ్మ ఆలయ ప్రాంగణంలో అష్టాదశ శక్తిపీఠాలను నిర్మించాలన్న సంకల్పానికి భక్తుల నుంచి మద్దతు లభిస్తోంది. ఒక్కో శక్తిపీఠం నిర్మాణానికి రూ. 2.50 లక్షల చొప్పున విరాళాలు అందించేందుకు 18 మంది భక్తులు ముందుకు రావడం విశేషం. మొత్తం 18 అష్టాదశ శక్తిపీఠాలు నిర్మితమైతే ఆలయ ప్రాంగణం మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకోవడంతో పాటు, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని భక్తులు ఆశిస్తున్నారు. అష్టాదశ శక్తిపీఠాల నిర్మాణం పూర్తయితే శ్రీ జమ్ములమ్మ ఆలయానికి రాష్ట్రాల సరిహద్దులు దాటి మరింత గుర్తింపు లభించడంతో పాటు, బ్రహ్మోత్సవాల వైభవం మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. భక్తుల విరాళాలకు సార్థకత చేకూరాలంటే వారు ఆశిస్తున్న విధంగా నిర్మాణాలు కార్యరూపం దాల్చడం కీలకమని పేర్కొంటున్నారు. 2022లో అప్పటి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అష్టాదశ శక్తిపీఠాల నిర్మాణానికి సంబంధించిన విరాళాల సేకరణ చేపట్టిన నేపథ్యంలో, అప్పుడు భక్తులు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఈ సంకల్పంపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. భక్తులు అందించిన విరాళాలు ఆశించిన ఆధ్యాత్మిక నిర్మాణాలకు ఉపయోగపడి, సంకల్పం కార్యరూపం దాల్చినప్పుడే వారి నమ్మకానికి పూర్తి సార్థకత చేకూరుతుందని భక్తులు కోరుతున్నారు. అష్టాదశ శక్తిపీఠాల నిర్మాణం పూర్తిచేసి శ్రీ జమ్ములమ్మ ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దితే, భవిష్యత్తులో బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు మార్గం సుగమమవుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల ఆకాంక్షకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తయి, జమ్ములమ్మ దేవస్థానం ఆధ్యాత్మిక వైభవానికి మరింత ప్రతీకగా నిలవాలని కోరుతున్నారు.

# ఈటెలను కలిసిన భాజపా నాయకులు



కీసర, అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర : మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ను, కంటెస్టెడ్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ మోహన్ రెడ్డిలను నాగారం భాజపా నాయకులు దసరా సందర్భంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి,మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, భాజపా నాయకులు రామక్కపేట రవీందర్ రెడ్డి, నక్క కిషోర్ గౌడ్, మెరుగు శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి నరేష్, జ్యోతి పాండే పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన బిఆర్ఎస్ నాయకులు



కీసర, అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర : మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని నాగారం బిఆర్ ఎస్ నాయకులు తేళ్ల శ్రీధర్, చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, కౌకుంట్ల అనంత రెడ్డి, బండారి శ్రీకాంత్ యాదవ్, నిమ్మల శ్రీనివాస్, తుడి విగ్నేష్ తదితరులు బుధవారం కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుక



కీసర, అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర : దసరా పండుగ సందర్భంగా నాగారం డివిజన్ మహిళా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలను సామాజిక కార్యకర్త అక్కల రూపా సురేష్ కుమార్ అందజేశారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ మహిళా సిబ్బందిని గౌరవించాలని ఉద్దేశంతో దసరా కానుకలను అందజేసినట్టు అక్కల రూపా సురేష్ కుమార్ తెలిపారు. పారిశుద్ధ కార్మికులను గర్వించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# యూజీడీ పనులు ప్రారంభం



జవహర్ నగర్, అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర : చంద్రపురి కాలనీ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో యూజీడీ పనులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ వేణు లతో కలిసి ప్రారంభించారు. ఉపాధ్యక్షులు చిట్టి బాబు, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, రజిత గోపాల్, నర్ర మహేష్, భాస్కర్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాహుల్ కదం, మైనారిటీ అధ్యక్షులు ఎండీ గౌస్, బషీర్, షఫీ, శ్రీరామ్, నాగరాజు, శ్రీనివాస్, స్రవంతి, స్వామి గౌడ్ పాల్గొన్నారు.

# బ్రాహ్మణులు సంఘటితం కావాలి

**- రాష్ట్ర నాయకులు వారాణసి రాంప్రసాద్**



నారాయణపేట, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) : బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ రాష్ట్ర నేత , ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ డి సి ఎం ఎస్ వైస్ చైర్మన్ వారాణసి రాంప్రసాద్ మరియు బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు కొల్లూర్ భీంసేన్ రావ్ మాట్లాడుతూ బ్రాహ్మణులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రములోని ఉత్తరాది మఠం మరియు పరిమళాపురం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠాలలో బ్రాహ్మణ ఆత్మీయుల సమ్మేళనాన్ని ఉద్దేశించి వారు ప్రసంగించారు. ఈనెల 25న జడ్చర్ల లోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో జరిగే ఉమ్మడి పాలమూరు జిల్లా బ్రాహ్మణ శంఖారావానికి జిల్లా వ్యాప్తంగా బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తమ ఐక్యతను చాటాలన్నారు. బ్రాహ్మణుల సమస్యల సాధన కోసం సంఘటితంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బ్రాహ్మణులంతా శంఖారావానికి తరలివచ్చి తమ ఐక్యతను చాటాలన్నారు .ఈ కార్యక్రమంలో ఉత్తరాది మఠం మేనేజర్ హరీష్ ఆచార్య, రాఘవేంద్ర స్వామి మఠం అర్చకులు కొల్లూర్ నరసింహ చారి, లక్ష్మీశోభాన భజన మండలి అధ్యక్ష ,కార్యదర్శిలైన యాద్గీర్ మంగళ విజయాచారి , భళ్ళారి విద్య ,బ్రాహ్మణ సంఘం నేతలు గోపీనాథ్ రావు , రఘునాథరావు రవీంద్ర చారి , కొప్రేశా చారి , అనంతరావు, శేషగిరిరావు, మూర్తి ,నారాయణరావు, అనిల్ దేశాయ్ ,దీపక్, అనిరుద్ధాచారి ,నరహరి, రాఘవేంద్ర తదితరులున్నారు.

స్వామీజీ చేతిల మీదుగా కరపత్రాలు ఆవిష్కరణ .....

నారాయణపేట ఉత్తరాదిమటంలో ఉడిపి స్వామీజీ గోవింద తీర్థులు ఈనెల 25న జడ్చర్లలో జరిగే బ్రాహ్మణ శంఖారావం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ విష్ణు సహస్ర నామ పారాయణం ప్రతి ఇంట్లో కొనసాగి ఆధ్యాత్మిక దైవచింతన పెంపొందాలన్నారు . ధర్మాన్ని అనుసరిస్తూ బ్రాహ్మణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూజలో పాల్గొన్న తెలకపల్లి అర్చకుడు ఈశ్వర్ సాయి శర్మ



నాగర్ కర్నూలు జిల్లా, (ఫోటో జర్నలిస్ట్ మల్లేష్ బాబు) అక్టోబర్21, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లి లో విజయదశమి సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు పూజలో భాగంగా తెలకపల్లి కి చెందిన అర్చకుడు ఈశ్వర సాయి శర్మ పాల్గొని పూజలు చేశారు ఈ సందర్భంగా అర్చకులు,శ్రీపాద కులకర్ణి, వీరయ్య శర్మ,దుర్గా శర్మ,, శివ కుమార్ శర్మ,సీఎం కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేశారు.

# తోటకూర వజ్రేష్ యాదవ్, తోటకూర అజయ్ యాదవ్‌లకు దసరా శుభాకాంక్షలు తెలిపిన పీర్జాదిగూడ నాయకులు



బోడుప్పల్,అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌లను పీర్జాదిగూడకు చెందిన కాంగ్రెస్ నాయకులు విజయదశమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. పండుగను పురస్కరించుకుని నాయకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జలేందర్ రెడ్డి,నాయకులు ఈశ్వర్ రెడ్డి, పీర్జాదిగూడ డివిజన్ ఆదధ్యక్షుడు బండి శ్రీరాములు,సాయి ఐశ్వర్య ఆధ్యక్షుడు జంగారెడ్డి,ముత్యం రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానం

**- వనపర్తిలో ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్**

**- పెబ్బేరు జట్టు ఘన విజయం, - నేడు సెమీఫైనల్, ఫైనల్స్ మ్యాచ్‌లు**





వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) : దేశ ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల అసమాన ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వివేకానంద క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం 32 జట్లు పోటీపడుతున్నాయి. టోర్నమెంట్‌లో భాగంగా నాల్గవ రోజు నాగవరం, పెబ్బేరు జట్ల మధ్య లీగ్ మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అనుజ్ఞా రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామన్నగారి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు గంధం ప్రవీణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మ్యాచ్‌ను తిలకించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

***క్రీడలతోనే పరిపూర్ణ వికాసం: బీజేపీ నేతలు***

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆటలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా వేదికలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ లీగ్ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన పెబ్బేరు జట్టు విజయం సాధించింది. గెలుపొందిన పెబ్బేరు క్రీడాకారులను బీజేపీ నాయకులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

***నేడు అట్టహాసంగా సెమీఫైనల్, ఫైనల్స్***

వనపర్తి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నేడు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ ముగింపు వేడుకలకు క్రీడాభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మ్యాచ్‌లను విజయవంతం చేయాలని వివేకానంద క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ కమిటీ కోరింది.

# పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం

**- శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం**

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర ) : సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పడంతో పాటు ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలకు కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ, అవసరమైన సందర్భాలలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని, పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. దేశ సరిహద్దుల పరిరక్షణలో సైన్యం, నావికాదళం, వైమానిక దళం కీలక పాత్ర పోషిస్తుండగా, దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతను పోలీసులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతి భద్రతలను కాపాడటం పోలీసుల ప్రధాన బాధ్యతలని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో శాంతి సామరస్యాలు నెలకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, పోలీసు శాఖ నిరంతర కృషి, అంకితభావం వల్ల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించగలుగుతున్నారని తెలిపారు. పోలీసు విధులు సవాళ్లతో కూడుకున్నవని, ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రజలు తమ బాధ్యతను గుర్తించి చట్టాలను, నిబంధనలను పాటించాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. సామాజిక బాధ్యత, పౌర స్పృహతో నిబంధనలు పాటించడం ద్వారా సమాజంలో సమస్యలను తగ్గించి, మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. పోలీసు శాఖకు ప్రజలు సహకరించడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని, తద్వారా అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత సరిహద్దు గస్తీ విధులలో ఉన్న సిఆర్‌పిఎఫ్ బృందంపై శత్రు బలగాలు ఆకస్మిక దాడి చేయగా, మన జవాన్లు వీరోచితంగా పోరాడి వీరమరణం పొందారని, ఆ చారిత్రక ఘటన స్ఫూర్తితోనే దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఈ రోజున పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అమరవీరుల స్మారకంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉన్నత ఆశయం కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అంకితభావంతో పని చేస్తారని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ప్రతీ పోలీస్, సైనిక జవాను త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం, ప్రజల ప్రాణ, ఆస్తులకు రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. విధులలో ఉండే సిబ్బంది అంతా పూర్తి మనస్ఫూర్తిగా, అంకితభావంతో పని చేస్తూ పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంత కష్టం వచ్చే దుర్గమ్మ తల్లి!!

**'గోదారమ్మ' ఒడి ఎండిపాయె.. 'దుర్గమ్మ' కన్నీరాయె**

**గోదావరిఖని బ్రిడ్జి వద్ద దుర్గమ్మ నిమజ్జనానికి నీటి కటకట**

**సంప్రదాయానికి బ్రేకులు.. మండిపడుతున్న భక్తజనం**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): నిండుగా ప్రవహించే గోదావరి నది.. భక్తిపారవశ్యంతో పులకించిపోయే భక్తకోటి.. "జై భవానీ.. జై జై భవానీ" అన్న నినాదాలతో దద్దరిల్లే గోదావరి తీరం.. దశాబ్దాలుగా గోదావరిఖని సాక్షిగా సాగుతున్న పవిత్ర దృశ్యమిది. కానీ ఈసారి అక్కడ కనిపిస్తున్న దృశ్యం వేరు. కళ్లు తెరిచి చూస్తే కన్నీరొచ్చే కఠిన వాస్తవం.. గోదారమ్మ ఒడిలో సేదతీరాల్సిన జగన్మాత, చుక్క నీరు లేక వట్టి ఇసుక తిన్నెలపై నిస్సహాయంగా ఎదురుచూడాల్సిన దుస్థితి. 'ఎంత కష్టం వచ్చింది తల్లి నీకు!' అంటూ భక్తుల గుండెలు తరుక్కుపోతున్నాయి.

**నీరు లేని నది.. వీడని నిరాశ**

ప్రతి ఏటా శరన్నవరాత్రులు ముగియగానే దేవీ నవరాత్రుల ఉత్సవ మూర్తులను, అంతకుముందు వినాయక ప్రతిమలను గోదావరిఖని బ్రిడ్జి పైనుంచే శాస్త్రోక్తంగా నిమజ్జనం చేయడం ఆనవాయితీ. కానీ ప్రస్తుత దృశ్యం భిన్నంగా ఉంది. బ్రిడ్జి కింద ఎటు చూసినా తేలియాడుతున్న ఇసుక మేటలు.. ఎండిపోయిన రాళ్ల గుట్టలు. నిమజ్జనానికి సరిపడా లోతు కాదు కదా, కనీసం బొటనవేలు మునిగేంత నీరు కూడా కానరాని పరిస్థితి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిమజ్జన వేదికను సుదూర ప్రాంతాలకు మార్చాల్సి రావడం స్థానిక మండప నిర్వాహకులను, భక్తులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

పాలకులది 'ప్రకృతి' వంక.. విపక్షాలది 'నిర్లక్ష్యపు' బాణం!

ఈ గందరగోళంపై స్థానికంగా రాజకీయ దుమారం కూడా రాజుకుంది.

**ప్రభుత్వ వాదన**

"వర్షాభావ పరిస్థితులు, ఎగువ నుంచి ఆశించిన స్థాయిలో ప్రవాహం లేకపోవడం వల్లే గోదావరిలో నీటిమట్టం పడిపోయింది. ఇది ప్రకృతి తెచ్చిన కరువు" అంటూ అధికారులు, పాలకవర్గం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోంది.

**ఆందోళనలో భక్తులు, విపక్షాలు**

మరోవైపు వి.హెచ్.పి, బీజేపీతో పాటు మండప నిర్వాహకులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "నవరాత్రులు ముగిసే సమయానికి నిమజ్జనాలు ఉంటాయని ముందే తెలుసు. ఎగువ ప్రాజెక్టుల నుంచి కనీస నీటిని విడుదల చేయించి నదిలో నిమజ్జనానికి అనువైన ఏర్పాట్లు చేయడంలో యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. పవిత్రమైన పండుగ వేళ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు" అంటూ నిర్వాహకులు మండిపడుతున్నారు.

**'మురుగు' గుంటలో జగన్మాతకా? నగరపాలక సంస్థపై భగ్గుమన్న భక్తకోటి!**

గోదావరిలో నీరు లేదన్న నెపంతో రామగుండం నగరపాలక సంస్థ అధికారులు చూపిన ప్రత్యామ్నాయం భక్తుల ఆగ్రహానికి ఆజ్యం పోసింది. నిమజ్జనం కోసం ప్రగతి నగర్ చెరువులో ఏర్పాట్లు చేశామంటూ బల్దియా యంత్రాంగం చేతులు దులుపుకునే ప్రకటన చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది. అది పవిత్రమైన చెరువు కాదని, నగరంలోని వ్యర్థాలన్నీ వచ్చి చేరే కంపుకొట్టే మురుగు నీటి కుంట అని విపక్షాలు, వి.హెచ్.పి, మండప నిర్వాహకులు నిప్పులు చెరుగుతున్నారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమనిష్టలతో పూజలందుకున్న ఆ జగజ్జననిని తీసుకెళ్లి మురుగు నీటిలో కలపమంటారా అంటూ నగరపాలక సంస్థ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. భక్తుల ఆత్మగౌరవాన్ని, హిందువుల సెంటిమెంట్‌ను బల్దియా అధికారులు కాలరాస్తున్నారని, పవిత్ర గోదావరిలో నీటిని విడుదల చేయించే చిత్తశుద్ధి లేక.. ఇంతటి ఘోరమైన నిర్ణయం ఎలా తీసుకుంటారని మండిపడుతున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ క్షేత్రస్థాయిలో ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

**సంప్రదాయానికి గండి..**

**మోడర్న్ కాలంలో పాలనా వైఫల్యం!**

హైటెక్ హంగులు, అద్భుతమైన మండపాలతో తొమ్మిది రోజుల పాటు కనులపండువగా పూజలు అందుకున్న అమ్మవారు.. చివరకు సాగనంపే వేళ ఇలా నీళ్ల కోసం అల్లాడాల్సి రావడం భక్తుల మనసును తీవ్రంగా గాయపరుస్తోంది. 'నది ఉంది కానీ నీరు లేదు.. ఉత్సవాలున్నాయి కానీ కనీస ముందస్తు ప్రణాళిక లేదు' అన్న చందంగా మారింది యంత్రాంగం తీరు. ప్రకృతి కన్నెర్ర చేసిందా లేక పాలకుల అలసత్వమే ఈ పరిస్థితికి కారణమా అన్న ప్రశ్న పక్కన పెడితే.. ఆపద మొక్కుల తల్లికే ఇంతటి అగచాట్లు తప్పకపోవడం నిజంగా కలికాలపు విషాదమే.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**- ప్రాణాలను సైతం లెక్కచేయక ప్రజల భద్రతే ధ్యేయంగా విధులు**

**- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డి. సునీతారెడ్డి**

**- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చూపించే అంకితభావం ప్రశంసనీయం**

**- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం**





వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర) : ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలు అత్యంత అభినందనీయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయ పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డి. సునీతారెడ్డితో కలిసి పరేడ్ మైదానంలోని స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

**ప్రమాదకర పరిస్థితుల్లోనూ సేవలు: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు తమ కుటుంబాలను పక్కనపెట్టి, నిరంతరం ప్రజల రక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని అన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ సమాజానికి భరోసా కల్పిస్తున్న పోలీసులందరికీ సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో వనపర్తి జిల్లా పోలీసులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని, పోలీసుల విధుల పట్ల తనకు ప్రత్యేక గౌరవం ఉందని పేర్కొన్నారు.

**అమరుల త్యాగాలు మరువలేనివి: కలెక్టర్ ఆదర్శ్ సురభి**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సంస్మరణ దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 154 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోగా, అందులో నలుగురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారని చెప్పారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ సమాజ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేస్తున్న పోలీసుల సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు.

**అమరుల ఆశయ సాధనకు కృషి: ఎస్పీ డి. సునీతారెడ్డి**

జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఎంతటి ప్రమాదాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ప్రజలకు సేవలందించడమే పోలీసుల నైతిక బాధ్యత అని చెప్పారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా సిబ్బంది క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. శాంతియుత సమాజ నిర్మాణంలో ప్రజలు కూడా పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

**అమరవీరుల కుటుంబాలకు సన్మానం**

ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు విడిచిన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను ముఖ్య అతిథులు శాలువాలతో ఘనంగా సత్కరించి, పోలీసు శాఖ తరఫున కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, డీఎస్పీ గిరిబాబు, ఎస్పీ కార్యాలయ సిబ్బంది, వివిధ స్థాయిల పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు నివాళు లర్పించారు.

# ప్రతిపక్షాల పైన విషం గక్కుతున్నా ప్రధాని మోడీ

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 ( విజన్ ఆంధ్ర ) : విజయ దశమి వేడుకల సందర్భంగా వేరు వేరు ప్రాంతాలలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపక్షాల పైన విషం గక్కుతున్నారని, దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు, విద్యార్థులు, యువకులు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతుంటే పరిష్కరించకుండా ప్రతిపక్షాలను దుమ్మెత్తి పోస్తున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో అన్నారు. పోరాడుతున్న వారందరూ విదేశీ శక్తుల మద్దతుతో పోరాడుతున్నారని తప్పుడు ప్రచారం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలో ఉన్న కోట్లాదిమంది పౌరుల ఓట్లను తొలగించి వారికి జరిగిన అన్యాయానికి కారణభూతుడైన చీఫ్ ఎలక్షన్ కమిషన్ జ్ఞానేష్ కుమార్ ను రాజీనామా చేయాలని డిమాండ్ చెయ్యడాన్ని వారు తప్పు పడుతున్నారని అన్నారు. వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాస్వామ్యానికి మాత్ర వేస్తున్నాడని, సెక్యులరిజం కనపడకుండా చేస్తున్నాడని, సెక్యులరిజం గురించి మాట్లాడితేనే తప్పు అనే ప్రచారం గా చిత్రీకరిస్తున్నారని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మత ప్రాతిపదికన సమాజంలో విభజన తీసుకువచ్చేదే బిజెపి ఆర్ఎస్ఎస్ అని, మైనార్టీలకు వ్యతిరేకంగా మెజార్టీ హిందువులను రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ధి పొందుతున్నారని, ప్రతిపక్షాలే సమాజాన్ని చీల్చుతున్నాయని తప్పుగా విష ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీలపై దాడులు పెరిగాయని, వారిని రెండవ శ్రేణి పౌరులుగా చూస్తున్నారని, పరిపాలనలో ఎక్కడ భాగస్వామ్యం చేయడం లేదని ఈ విధంగా సమాజంలో విభజన వాదాన్ని ముందుకు తీసుకపోతున్నారని అన్నారు. విభజించు పాలించు అనే నినాదంతో తమ అధికారాన్ని సుస్థిరం చేసుకునే విధంగా ప్రయత్నాలు చేస్తూ తిరిగి వారే నీతులు చెబుతున్నారని అన్నారు. గత 12 సంవత్సరాలుగా ఏ ఒక సమస్య పరిష్కరించని బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే దిగిపోవాలని ఆయన డిమాండ్ చేశారు. 2014 ఎన్నికలలో చెప్పిన ఏ ఒక్క అంశాన్ని కూడా అమలు చేయకుండా వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని అవినీతిని దేశంలో పెంచి పోషిస్తూ, కార్పొరేట్కు ఊడిగం చేస్తూ దేశాన్ని సర్వనాశనం చేసి ప్రపంచం ముందు మన భారతదేశ పరువును మంటగలుపుతున్నారని రామకృష్ణ తెలిపారు. మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే, కాపాడుకోవాలంటే అందరూ కూడా సమైక్యంగా ముందుకు సాగాలని, ప్రజాతంత్ర, లౌకిక శక్తులందరూ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు.

# వజ్రేష్ యాదవ్ ను కలిసిన విజయ రెడ్డి



కీసర, అక్టోబర్ 21, విజన్ ఆంధ్ర : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామిడి విజయ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామిడి విజయ రెడ్డి వజ్రేష్ యాదవ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు..



నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 21 ( విజన్ ఆంధ్ర) : నారాయణపేట మండల పరిధిలో జాజాపూర్ గ్రామంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దసరా వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో పాటు ఆయా గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. ప్రజలు కొత్త దుస్తులు ధరించి, దేవాలయాలను సందర్శించి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విజయదశమి వేడుకల్లో పాల్గొన్నారు. పల్లెపల్లెలో పండుగ వాతావరణం నెలకొనగా, ప్రజలు పరస్పరం దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంగా గడిపారు. అలాగే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు కొత్త వాహనాలను కొనుగోలు చేయగా, మరికొందరు తమ పాత వాహనాలకు పూజలు నిర్వహించారు. వాహనాలకు పూలమాలలు, పసుపు, కుంకుమలతో అలంకరించి, కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వాహన పూజల సందడి కనిపించింది. అనంతరం సాయంత్రం ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులతోపాటు ప్రజలు శమీ ఊరేగింపును గ్రామ పురవీధుల గుండా ర్యాలీగా తిరుగుతూ స్థానిక పాఠశాలలో జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు . ప్రజలు ఒకచోట చేరి శమీ పత్రిని పంచుకోవడం ద్వారా పరస్పర స్నేహభావాన్ని చాటుకున్నారు. పెద్దలు, యువకులు, మహిళలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. విజయానికి ప్రతీకగా భావించే విజయదశమి పర్వదినాన్ని ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవడంతో మండలంలోని ఆయా గ్రామాలలో పండుగ సందడి నెలకొంది.

## ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా విజయదశమి వేడుకలు

- 50 ఏళ్లకు పైగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు
- రామబాణంతో రావణ దహనం నిర్వహించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 21 )విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలో విజయదశమి వేడుకలను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలో 50 ఏళ్లకు పైగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ , ఆదిలాబాద్ ఎంపీ గూడెం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దస్నాపూర్‌లో నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి హాజరయ్యారు. దస్నాపూర్‌లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విజయానికి ప్రతీకగా భావించే శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా పట్టా పాస్ పుస్తకాలను, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆయుధాన్ని చేత పట్టి, పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మఠాధిపతి యోగానంద సరస్వతి సమక్షంలో షమీ చెట్టు పూజా కార్యక్రమాలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రామబాణంతో రావణుడి బొమ్మను వెలిగించి రావణ దహన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## ఆదిలాబాద్ పట్టణం లోని మోచిగల్లీలో మద్యం మత్తులో పోలీసులతో దురుసు ప్రవర్తన

- డయల్ 112 ఫిర్యాదుపై వెళ్లిన పోలీసులతో వాగ్వాదం.. నిందితుడి అరెస్ట్
- పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ న్యూసెన్స్ సృష్టించిన నిందితుడు
- పోలీసుల విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలోని మోచిగల్లీలో అర్ధరాత్రి మద్యం సేవిస్తూ అల్లరి చేయడమే కాకుండా, విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడిన నిందితుడు భూపతి వెంకటేష్ పై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాత్రి పెట్రోలింగ్ విధుల్లో ఉన్న డయల్ 100 సిబ్బంది వన్ టౌన్ కానిస్టేబుల్ గాలి శ్రీధర్, ఏ ఆర్ ఎచ్ సి ముఖేష్, హోంగార్డు దేవిదాస్‌లకు 21.న అర్ధరాత్రి 1:10 గంటల సమయంలో డయల్ 112 ద్వారా ఫిర్యాదు అందింది. మోచిగల్లీలోని ఒక షాపు వద్ద కొందరు వ్యక్తులు మద్యం సేవిస్తూ అల్లరి చేస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే అక్కడికి చేరుకున్నారు. అక్కడ నలుగురు వ్యక్తులు మద్యం సేవిస్తూ అల్లరి చేస్తుండగా, అర్ధరాత్రి సమయం కావడంతో షాపు మూసివేసి ఇంటికి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో వారిలో ఒక వ్యక్తి పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తూ కానిస్టేబుల్ను పట్టుకుని నెట్టివేసి, దురుసుగా ప్రవర్తించడం జరిగింది. పోలీసుల సూచనలను పట్టించుకోకుండా మోచిగల్లి ప్రాంతంలో న్యూసెన్స్ సృష్టించడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడికి బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా 335 ఎం జి/100ఎం ఎల్ రీడింగ్ నమోదైంది. నిందితుడు భూపతి వెంకటేష్ పై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పోలీసుల హెచ్చరిక:

ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించడం, విధులకు ఆటంకం కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం వంటి వాటిని ఉపేక్షించేది లేదని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- వధి నిర్వహణలో అసువులు బాసిన ప్రతి ఒక్క పోలీసు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు ఫ్లాగ్ డే
- ప్రస్తుత జిల్లా ప్రశాంత వాతావరణానికి కారణం ఒకప్పటి అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితమే
- సంఘవిద్రోహశక్తులతో పోరాడి అసువులు బాసిన ప్రతి ఒక్క పోలీసు కుటుంబానికి చేతులెత్తి దండం పెట్టిన జిల్లా ఎస్పీ.
- విశిష్ట అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్ రావు.
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్.
- ఘనంగా పుష్పగుచ్చాలతో నివాళులర్పించిన అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు.



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర)శాంతి భద్రతల పరిరక్షణ మరియు దేశ సరిహద్దు రక్షణ కోసం విది నిర్వహణలో అసువులు బాసిన పోలీసు ఫ్లాగ్ డే (అమరవీరుల సంస్మరణ దినోత్సవం) బుధవారం జిల్లాలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో గల అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించడం జరిగింది. అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్ రావు, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, న్యాయమూర్తి హుస్సేన్ నాయక్, అదనపు ఎస్పీ పి మౌనిక, ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, ఇతర శాఖల ఉన్నతాధికారులు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్చాలతో స్తూపం వద్ద నివాళులర్పించడం జరిగింది. జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే సందర్భంగా భారీ ఏర్పాట్ల మధ్య అమరవీరులను మనస్ఫూర్తిగా స్మరించుకోవడం జరిగింది. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం, దేశ రక్షణలో మరియు విధి నిర్వహణలో అసువులు బాసిన 154 మంది పోలీసు సిబ్బంది, అధికారుల పేర్లను అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక చదువుతూ స్మరించుకోవడం జరిగింది. మొదటగా అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ పుష్పగుచ్చాలతో కలిసి స్తూపం వద్ద, అమర జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు అమరవీరులకు సలామి శస్త్ర ద్వారా గౌరవ వందనాన్ని సమర్పించి, ఆయుధాలను తలకిందులుగా చేసి శోక్ శస్త్ర శ్రద్ధాంజలి ఘటించి, ద్వారా రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించుకున్నారు. తదుపరి అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించే దిశగా జిల్లా పరిపాలన మరియు పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తాందని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఒక పోలీసు వ్యవస్థనే ఇతరుల కోసం ప్రాణాలను సైతం అర్పిస్తుందని తెలియజేశారు. పోలీసులు నిస్వార్థమైన సేవలను అందిస్తారని వారికి ప్రతి ఒక్కరూ సహకరిస్తూ నేర నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి సంవత్సరం అమరవీరులను స్మరించుకుంటూ వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయాలని వారి కుటుంబ సభ్యులను సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలని తెలియజేశారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరపున ఎలాంటి సహాయ సహకారాలైన అందిస్తామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అక్టోబర్ 21న ప్రతి సంవత్సరం జరుపుకునే అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) 66 సంవత్సరాల క్రితం లడక్ సమీపంలో భారత సరిహద్దుల్లో పహారకాస్తున్న మన పోలీసు సిబ్బందిపై చైనీయులు దాడి చేశారని, ఈ ప్రదేశాన్ని హార్ట్ స్ప్రింగ్ గా పేర్కొంటారని,1959 అక్టోబర్ 21న ఆ సమయంలో విది నిర్వహణలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన పదిమంది సిఆర్పిఎఫ్ జవాన్ల వీరమరణం సందర్భంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరంఅక్టోబర్ 21న దేశవ్యాప్తంగా ఫ్లాగ్ డే దినోత్సవాన్ని అమరవీరుల ను స్మరించుకుంటూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వారి సంస్మరణ ఆదిలాబాద్ జిల్లా నందు పది రోజులపాటు, ప్రజా హిత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా నార్త్ తెలంగాణ లోని ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు సంఘవిద్రోహశక్తులతో పోరాడి చిరస్మరణీయులైన విషయం గుర్తు చేశారు. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణం లో కొనసాగడానికి అసువులు బాసిన ప్రతి ఒక్క అమరవీరుల కుటుంబ సభ్యులకు చేతులెత్తి దండం పెడుతూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నందు 50 మంది పోలీసు అధికారులు సిబ్బంది సంఘవిద్రోహశక్తులతో ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తూ ఎలాంటి అవసరాలైన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత సమాజం డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతుందని, దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖ అన్ని రంగాల్లో ముందుంటూ దేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు రెండవ బెటాలియన్ కమాండెంట్ బి వెంకటేశ్వర రెడ్డి, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్, ఆదిలాబాద్ జిల్లా సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, రెండవ బెటాలియన్ అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలలో కంది శ్రీనివాస రెడ్డి దంపతుల సందడి .....

- "బేల మండలం మసాల గ్రామంలో సంబరాలకు హాజరు....
- బతుకమ్మల చుట్టూ ఆడి పాడిన కంది శ్రీనివాస రెడ్డి , కంది మౌనా శ్రీనివాస రెడ్డి
- పలువురికి నగదు బహుమతులు అందించి ప్రోత్సహించిన కంది దంపతులు



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర)అదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి ,కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బేల మండలంలో పర్యటించారు . మండలంలోని భవానిగూడ అమ్మవారి ఆలయంలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మసాల (బి) గ్రామంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు హాజరయ్యారు. పలు గ్రామాల నుండి బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మసాల గ్రామంలో వందలాది బతుకమ్మల చుట్టూ మహిళలతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి దంపతులు బతుకమ్మ పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేసారు. అనంతరం పలువురిని నగదు బహుమతులతో ప్రోత్సహించారు. పూలను పూజించే సంస్కృతి బతుకమ్మ పండగ అని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. అందరికి బతుకమ్మ దసరా ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మసాల గ్రామంలో జరిగే బతుకమ్మ వేడుకలకు మూడోసారి హాజరవడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి ప్రజల ప్రేమ ఎంతో గొప్పదన్నారు. గ్రామంలో ప్రభుత్వం తరపున అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇంకా మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేసుకుందామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలు ఉచిత కరెంట్ , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం , రైతు భరోసా లాంటి పథకాలకు కేంద్రం నుండి సహాయం అందకున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే త్వరలో ప్రతీ మహిళకు నెలకు 2వేల 500 కూడా అందనున్నాయన్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వంలో నిధుల దుర్వినియోగం జరిగిందని విమర్శించారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. మరొక్కసారి రాష్ట్రంలో రేవంతన్న సర్కార్ ,కేంద్రంలో కూడా కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ఏర్పడి రాహుల్ గాంధీ ప్రధాని కావడం తధ్యమన్నారు. అందుకు మీ అందరి ఆశీర్వాదం అవసరమన్నారు.వచ్చే ఎన్నికల నాటికి ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామన్నారు.ఎంపీ ఎమ్మెల్యే స్థానాలను గెలిపించి రేవంతన్న కు రాహుల్ గాంధీకి కానుకగా ఇద్దామన్నారు. అందుకు కాంగ్రెస్ శ్రేణులందరు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.తాను అమెరికా నుండి వచ్చింది ఆదిలాబాద్ ప్రజలకు సేవ చేయడానికేనని స్పష్టం చేసారు. తనకు డబ్బు పై ఆశలేదని డబ్బు సంపాదనకు రాజకీయాలలోకి రాలేదన్నారు. ఆదిలాబాద్ కు ఎప్పుడొచ్చినా మీ బంధువు కంది శ్రీనివాస రెడ్డి ఉన్నాడన్న విషయం మరవవద్దని తన క్యాంపు కార్యాలయానికి వచ్చి బుక్కెడు బువ్వ తిని ఆశీర్వదించాలని కోరారు. తన పుట్టినూరు మెట్టినూరు తర్వాత బతుకమ్మ వేడుకలకు హాజరయింది మసాల గ్రామంలోని వేడుకలకే అని కంది మనా శ్రీనివాస రెడ్డి అన్నారు. అమ్మవారి తొమ్మిది రూపాలు మహిళ జీవితంలోని అనేక కోణాలను తెలియపరుచుతాయన్నారు. అమ్మాయిలు బాగాచదివి తమ సొంత కాళ్లపై నిలబడాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ కుమారులతో సమానంగా కూతుళ్లను కూడా చూసుకోవాలని వారిని అన్ని రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. అమ్మాయిని లక్ష్మీదేవిగానే కాకుండా అవసమయితే కాళికాదేవి గా మార్చాలన్నారు. తనకు ప్రతీ విషయంలో భర్త కంది శ్రీనివాస రెడ్డి ప్రోత్సాహం దొరుతుందని మహిళల ఆలోచనలకు గౌరవించే అలాంటి వ్యక్తికి భార్యగా ఉండటం తన అదృష్ట మన్నారు. చదువుకునే అమ్మాయిలకు ఏ అవసరమొచ్చినా సహాయం చేయడానికి వెనుకాడమన్నారు. స్త్రీలు చదువుకొని ఉద్యోగాలు చేయడమే కాకుండా రాజకీయాలలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీ చే గెలిపించాలని కోరారు . ఈ కార్యక్రమంలో బేల మండల కాంగ్రెస్ నాయకులు పలు గ్రామాల సర్పంచులు , ఉప సర్పంచులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- అమరుల స్ఫూర్తితో ప్రజా రక్షణకు అంకితభావంతో పనిచేయాలి : జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్
- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులకు ఘన నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, ఐఏఎస్, ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్







మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర ) : మహబూబాబాద్ జిల్లా పోలీస్ విధి నిర్వహణలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, ఐఏఎస్‌తో కలిసి అమర పోలీసులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.

హాట్ స్ప్రింగ్స్ ఘటన అమరుల త్యాగానికి ప్రతీక

1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద దేశ రక్షణ విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో పోలీసుల పాత్ర కీలకమని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు ప్రతి పోలీసు అధికారికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా పోలీసు శాఖ

తెలంగాణలో గతంలో నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో అనేక మంది పోలీసులు ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేశారని ఎస్పీ గుర్తుచేశారు. విధి నిర్వహణలో చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులకు నివాళి 2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసు సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఎస్పీ అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీసు సిబ్బంది ఉన్నారని తెలిపారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

పోలీస్‌ప్రజల మధ్య సత్సంబంధాలే లక్ష్యం

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం అనగా ఈరోజు 21 నుంచి అక్టోబర్ 31న నిర్వహించే సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం వరకు పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేసే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్‌ప్రజల మధ్య పరస్పర నమ్మకాన్ని బలోపేతం చేస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యం. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల రక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి అని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.



## శ్రీ జమ్ములమ్మ దేవతకు బంగారు హారం బహుకరించిన రాజశేఖర్ దంపతులు

గద్వాల అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జమ్మిచేడు శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి దేవాలయానికి కర్ణాటక లోని బీజాపూర్ కు చెందిన రాజశేఖర్ దంపతులు 10 గ్రాముల బంగారు గుండ్ల మాలను బహూకరించారు. బుధవారం శ్రీ జమ్మిచేడు జమ్ములమ్మ ఆలయంలో ఆలయ ఈవో పురందరు కుమారు కు అందజేయగా అమ్మవారికి అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం దాతలకు అమ్మవారి శేషం తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు.

## చోరీ కేసులను ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్

**- 4 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం - డి.ఎస్.పి లింగయ్య**



నారాయణపేట , అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లాతో పాటు ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన వరుస చోరీ కేసులను మరికల్ పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించడం జరిగింది అని నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. బుధవారం నారాయణపేట సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 9 న మరికల్ మండలంలోని మద్వార్ రోడ్డు వద్ద పల్లెగడ్డ గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు పతేరచ్చేడు గ్రామానికి చెందిన సత్యమ్మను మోసగించి సుమారు ఒకటిన్నర తులాల బంగారు నల్లపూసల తాడును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మరికల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్, ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ నల్లపు లింగయ్య పర్యవేక్షణలో, మరికల్ సీఐ భాగవంత్ రెడ్డి , సీసీఎస్ ఎస్ఐ విజయ్ భాస్కర్, మరికల్ ఎస్ఐ రాంలాల్ క్రైమ్ టీమ్ దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు. దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం సుమారు 6:30 గంటలకు ఆత్మకూర్ రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారిని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా యాపర్లదిన్నె మండలం బూడిదిపాడు గ్రామానికి చెందిన క్రిస్టప్ప, అలాగే తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాలోని జమ్మిచేడు గ్రామానికి చెందిన బోయ జమ్మన్న లను గుర్తించారు. పోలీసుల విచారణలో వీరు మరికల్‌లో జరిగిన చోరీతో పాటు ఆత్మకూర్, మక్తల్, దేవరకద్ర పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన మరో నాలుగు చోరీ కేసుల్లోనూ ప్రమేయం ఉన్నట్లు వెల్లడైంది. ఈ ఐదు కేసులకు సంబంధించి నిందితుల నుంచి మొత్తం సుమారు 4 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ కు తరలించడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. ఈ వరుస చోరీ కేసులను ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన మరికల్ సీఐ భాగవంత్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ విజయ్ భాస్కర్, మరికల్ ఎస్ఐ రాంలాల్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, కానిస్టేబుళ్లు తిరుపతిరెడ్డి, రవిలను డీఎస్పీ నల్లపు లింగయ్య అభినందించారు. నేరాల నియంత్రణకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు.

## జేమ్స్ డైసన్ అవార్డు టాప్-20లో 'రుద్రా'కు చోటు



హైదరాబాద్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) : జేమ్స్ డైసన్ అవార్డు-2026 గ్లోబల్ టాప్-20లో శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్‌కు చెందిన 20 ఏళ్ల లింగంపల్లి హిమజ రూపొందించిన 'రుద్రా' చోటు దక్కించుకుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాయిస్ ద్వారా పనిచేసే ఈ బ్రెయిలీ ప్రింటర్ దృష్టిలోపం ఉన్నవారు స్వయంగా బ్రెయిలీ పత్రాలను తయారు చేసుకునేందుకు ఉపయోగ పడుతుందని తెలిపారు. డైసన్ ప్రిన్సిపల్ ఇంజినీర్, అవార్డు టాప్-20 న్యాయనిర్ణేత కే యోంగ్ నేతృత్వంలోని ఎంపిక ప్రక్రియలో ఈ ఆవిష్కరణ గుర్తింపు పొందిందని తెలిపారు. తుది దశలో సర్ జేమ్స్ డైసన్ విజేతలను ఎంపిక చేయనుండగా, నవంబర్ 4న ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. విజేతలకు 30 వేల పౌండ్ల బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.

## పల్లె టూర్ - సీతారాంపూర్‌లో ఘనంగా దసరా సంబరాలు

**- పట్టణాలు, జిల్లా కేంద్రాలు, ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న ప్రతి ఒక్కరు గ్రామంలో జరిగే దసరా సంబరాలకు హాజరు.**



కామారెడ్డి బ్యూరో (దోమకొండ) అక్టోబర్ 21(విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సీతారాంపూర్( గొట్టుముక్కుల) గ్రామంలో మంగళవారం జరిగిన దసరా సంబరాలు ఆత్మీయత, బంధుత్వాలు, దసరా సందర్భంగా ఒకరినొకరు పులకరించుకుంటు గ్రామాన్ని విడిచి పట్టణాలకు వెళ్లి నవారు. పండగ సందర్భంగా పుట్టి పెరిగిన గ్రామానికి వచ్చి ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా అన్యోన్యంగా గ్రామంలో దసరా సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కులమతాలకు అతీతంగా, చిన్న పెద్ద తేడా, లేకుండా అన్న ,తమ్మి, బావ, మామ, తాత అని పిలుస్తూ వివిధ వరుసలతో పలకరించుకుంటూ, బంగారం లాంటి భూములలో పాలపిట్ట ను చూసి పంటలను, చూస్తూ సంతోషకరమైన వాతావరణంలో దసరా సంబరాలు జరిగాయి. కామారెడ్డి జిల్లా సీతారాంపూర్ గ్రామంలో గ్రామస్తుల ఐక్యతకు నిదర్శనం ఈ గ్రూప్ ఫోటో.

## నేడు(అక్టోబర్ 22) న పత్తి కొనుగోళ్లు ప్రారంభం...

**- ఎంఎస్‌పీకి కొనుగోలు రైతులు నాణ్యమైన పత్తిని తీసుకురావా**

**-జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో 202627 పత్తి సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళు గురువారం (అక్టోబర్ 22) ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సీసీఐతో పాటు ప్రైవేటు వ్యాపారుల ఆధ్వర్యంలో కొనుగోళ్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు పత్తిని విక్రయించుకునేలా నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన పత్తిని మార్కెట్‌యార్డుకు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పత్తి విక్రయానికి ముందుగా 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పత్తి నాణ్యత, తేమ తదితర అంశాల్లో రైతులు నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, పత్తి వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, మార్కెట్ కమిటీ అధికారులు, హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- **1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని విధి నిర్వహణలో తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన రోజు అక్టోబర్ 21**
- **జిల్లా ఎస్పీ. యం. రాజేష్ చంద్ర.**
- **అమరవీరుల స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి - జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్**
- **కామారెడ్డి జిల్లా లో ఏడుగురు పోలీసులు అమరత్వం, వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటాం.**
- **అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.**








కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 21(విజన్ఆంధ్ర) : పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర అన్నారు. అమరవీరుల స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా లో ఏడుగురు పోలీసులు అమరత్వం పొందారని, వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటాం అని భరోసానిచ్చారు. అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తు చేశారు దినోత్సవాన్ని(పోలీస్ ఫ్లాగ్ డే) పురస్కరించుకుని బుధవారం కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారని గుర్తుచేసుకున్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర మాట్లాడుతూ..

దేశం కోసం, రాష్ట్రం కోసం విధి నిర్వహణలో తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకునే రోజు అక్టోబర్ 21 అని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, తెలిపారు. ఆ మహనీయుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహిం చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

జవానులు, పోలీసులు విధి నిర్వహణలో కర్తవ్యానికి ప్రాధాన్యమిస్తూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని అక్సాయ్ చిన్ ప్రాంతంలో చైనా దళాల దాడిలో పది మంది కేంద్ర రిజర్వ్ పోలీసు దళ సిబ్బంది వీరమరణం పొందిన ఘటనకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు.

ఈ ఏడాది దేశవ్యాప్తంగా అసాంఘిక శక్తులను ఎదుర్కొంటూ 154 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందగా, తెలంగాణ రాష్ట్రం నుంచి నలుగురు అమరులయ్యారని తెలిపారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని తెలిపారు. వారి త్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ ..

విధి నిర్వహణలో అమరులైన పోలీసుల స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. సమాజ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలంటే శాంతిభద్రతలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, దేశ అంతర్గత భద్రతలో పోలీసులు తమ అమూల్యమైన ప్రాణాలను సైతం త్యాగం చేస్తూ ప్రజల రక్షణకు అంకితమవుతున్నారని తెలిపారు. అటువంటి మహనీయులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని అన్నారు.

అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారు భవిష్యత్తులో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఉంటే ఏ సమాయములోనైనా తనను వచ్చి కలవ వచ్చు అని తెలిపారు, వెంటనే వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు.

కామారెడ్డి జిల్లా పోలీసు అమరవీరుల వివరాలు:

1.ఎం.డి. కుతుబుద్దీన్, కానిస్టేబుల్: 1989వ సంవత్సరంలో నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పల్లికొండ వద్ద నక్సలైట్లతో జరిగిన ఎదురుకాల్పుల్లో అమరులయ్యారు.

2. పి. సత్తయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్: 1991వ సంవత్సరంలో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సుద్దులం వద్ద నక్సలైట్లు పోలీసు బృందాన్ని లక్ష్యంగా చేసుకుని మందుపాతర పేల్చిన ఘటనలో అమరులయ్యారు.

3.హెచ్. సుబ్బారావు, కానిస్టేబుల్: 1991వ సంవత్సరంలో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సుద్దులం వద్ద నక్సలైట్లు మందుపాతర పేల్చిన ఘటనలో అమరులయ్యారు.

4. వి. మారుతి, కానిస్టేబుల్: 1992వ సంవత్సరంలో కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం బురుగిద్ద వద్ద నక్సలైట్లు కేంద్ర రిజర్వ్ పోలీసు దళ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మందుపాతర పేల్చిన ఘటనలో అమరులయ్యారు.

5. ఎస్. ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్: 1994వ సంవత్సరంలో పద్మాజివాడి రహదారి వద్ద నక్సలైట్ల హింసాత్మక ఘటనలో ప్రాణాలు కోల్పోయారు.

6.ఎస్.వి. కృష్ణారావు, కానిస్టేబుల్: 1999వ సంవత్సరంలో గాంధారి మండల వారపు సంత వద్ద నక్సలైట్ల కాల్పుల్లో అమరులయ్యారు.

7. బి. రాములు, కానిస్టేబుల్: 2001వ సంవత్సరంలో తన బంధుమిత్రులతో కలిసి శుభకార్యంలో పాల్గొన్న సమయంలో నక్సలైట్ల కాల్పుల్లో అమరులయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. నర్సింహారెడ్డి, డీఎస్పీలు ఎస్. మధుసూదన్, పి. విట్టల్ రెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, గట్టుమల్లు, ఉదయ్ భాస్కర్ ఇన్‌స్పెక్టర్స్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా వివిధ పోటీలు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది, ప్రజలకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, తెలిపారు.

1. విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు: (తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో 500 పదాలకు మించకుండా వ్యాసరచన.) చివరి తేదీ: 28.10.2026

ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు అంశాలు:

1.సైబర్ నేరాల నివారణలో పోలీసులు, పౌరుల పాత్ర. 2. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలి

డిగ్రీ, ఆపై చదువుతున్న విద్యార్థులకు అంశాలు:

1.సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర.

2.తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర.

ఆసక్తి గల విద్యార్థులు కింది లింక్ ద్వారా నమోదు చేసుకుని, సూచించిన భాషలో కాగితంపై వ్యాసం రాసి, ఫొటో లేదా పీడీఎఫ్ రూపంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. నమోదు లింక్:
https://forms.gle/YkeKUscWu5LFYWFH7

మూడు భాషల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయబడును.

2. పోలీసు సిబ్బందికి ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు

తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో 500 పదాలకు మించకుండా వ్యాసం రాయాలి. (చివరి తేదీ: 27.10.2026)

సబ్ ఇన్‌స్పెక్టర్, ఆపై స్థాయి అధికారులకు అంశాలు:

1.ప్రజల మన్ననలు, గౌరవం పొందేందుకు పోలీసులు చేయాల్సిన కృషి. 2. క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం.

కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి సిబ్బందికి అంశాలు:

1.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు.

2.పోలీసు అధికారుల జీవితాల్లో సామాజిక మాధ్యమాల పాత్ర, వాటి వ్యసనాన్ని అధిగమించి వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం సద్వినియోగం చేసుకునే విధానం.

పోటీల్లో పాల్గొనేవారు తమ పేరు,హోదా, ఇతర వివరాలతో కింది లింక్ ద్వారా నమోదు చేసుకుని,వ్యాసాన్ని ఫొటో లేదాపీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలి.

నమోదులింక్:
https://forms.gle/F7BcALuk23jDXBcL6

3. షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు : (చివరి తేదీ: 30.10.2026) -తెలంగాణ రాష్ట్ర పౌరులు పోలీసు సేవలు, ప్రజా భద్రత, నేరాల నివారణ, సమాజ భాగస్వామ్య పోలీసింగ్, పోలీసు అమరవీరుల త్యాగాలు వంటి అంశాలపై గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివి గల లఘు చిత్రాలను రూపొందించి పోటీల్లో పాల్గొనవచ్చు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో రూపొందించిన లఘు చిత్రాలను సమర్పించవచ్చు. అలాగే పోలీసు సేవలు, ప్రతిభను ప్రతిబింబించే ఇటీవలి ఛాయాచిత్రాలను కూడా పోటీలకు సమర్పించవచ్చు.

జిల్లా స్థాయిలో ఉత్తమ మూడు లఘు చిత్రాలు, మూడు ఛాయాచిత్రాలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి ఎంపిక కోసం పంపిస్తారు. ఎంపికైన వారికి ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారు.

నమోదు లింక్:
https://forms.gle/gVpPmmWFrWZNNRBF6

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించే పోటీలు, కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, కోరారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి.. 14 మంది అరెస్టు

**- రూ.2.24 లక్షల నగదు, 14 మొబైల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

**- పేకాటకు స్థలం కల్పించిన జిన్నింగ్ యజమానిపైనా కేసు**

**- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే**



ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇంద్రవెల్లి మండలంలోని పాడుబడిన మిట్టల్ జిన్నింగ్ ప్రాంగణంలో పేకాట ఆడుతున్న స్థావరంపై ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2,24,100 నగదు, 14 మొబైల్ ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు ఏఎస్పీ తెలిపారు. విచారణలో జిన్నింగ్ ప్రాంగణ యజమాని గోరేసేట్‌కు తెలిసే అక్కడ పేకాట నిర్వహిస్తున్నట్లు వెల్లడైందని, దీంతో ఆయనపైనా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు.

*అరెస్టయిన 14 మంది వీరే..*

పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఇంద్రవెల్లికి చెందిన తెహెరె గణేష్ (32), జాదవ్ దత్త (29), కాగ్నే గైనినాథ్ (29), ముప్పవరపు వంశీ (29), చింతవార్ సందీప్ (38), ఫడ్ విశాల్ (24), పాండే సంతోష్ (29), ఫడ్ విజయ్ (27), గైక్వాడ్ నారాయణరావు (49), జాదవ్ సతీష్ (35), కేంద్రే సందీప్ (40), దగ్గే సుధాకర్ (30), సత్వాజిగూడకు చెందిన సూర్యవంశీ తథాగత్ (26), సాలేవాడ (బి)కు చెందిన నాన్లన్వార్ హృదయ్ (23) ఉన్నారు.

*అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వండి*

జిల్లాలో ఎక్కడైనా పేకాట, గంజాయి, అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర అసాంఘిక చర్యలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలని ఏఎస్పీ కోరారు. ఇందుకోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నేరుగా పర్యవేక్షించే లిలివాట్సాప్ నంబర్ 8712659973లిలి కు సమాచారం పంపవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారితో పాటు వాటికి సహకరించే వారిపైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయుధ పూజ



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలో దసరా వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపుం కార్యాలయంలో వేడుకలు అంబరాన్నంటాయి. కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి కూతురు అరికా రెడ్డి కుమారుడు ఇషాన్ రెడ్డి లతో కలిసి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయుధ పూజ నిర్వహించారు. ప్రజలందరికి దంపతులు బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రలందరూ ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు సిరిసంపదలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయ ఆవరణలో విద్యానగర్ గ్యారేజీలోని వాహనాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసారు. అందరికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లా తాంసీ మండలం హస్నాపూర్ దసరా వేడుకలలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి సందడి



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర)విజయదశమి పండగను పురస్కరించుకొని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి తో కలిసి స్వగ్రామం తాంసీ మండలం హస్నాపూర్ గ్రామాన్ని సందర్శించారు. తన నివాసంలో తల్లిదండ్రులు కంది అనసూయా కిష్టారెడ్డి లకు శమీ పత్రి అందచేసి పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని శారదాదేవి మండపాలను సందర్శించి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు . మండపాల ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులంతా బతుకమ్మల చుట్టూ ఉత్సాహంగా బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేసారు. హస్నాపూర్ గ్రామస్తులందరికి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు బంగారం శమీ పత్రి అందచేసి కంది శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంది శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్చరీ ప్రీమియర్ లీగ్-2 చాంపియన్‌గా మైటీ మరాఠాస్




హైదరాబాద్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో మైటీ మరాఠాస్ చాంపియన్‌గా నిలిచింది. పీపుల్స్ ప్లాజాలో జరిగిన ఫైనల్లో కాకతీయ నైట్స్‌ను 6-2తో ఓడించింది. ఫైనల్లో బొమ్మదేవర ధీరజ్ 79/80, మైక్ ష్లోసర్ 80/80 పాయింట్లతో రాణించారు. ధీరజ్ టోర్నమెంట్ ఉత్తమ రికర్వ్ పురుష ఆర్చర్‌గా ఎంపికయ్యాడు. రెండో ఎలిమినేటర్‌లో మరాఠాస్ పృథ్వీరాజ్ యోధాస్‌ను 5-3తో ఓడించి ఫైనల్‌కు చేరింది. అమన్ సైనీ స్థానంలో మైక్ ష్లోసర్, అలెజాండ్రా వాలెన్సియా స్థానంలో సిమ్రాన్‌జీత్ కౌర్ ఆడారు. కాకతీయ నైట్స్ తరఫున నికో వీనర్, జ్యోతి సురేఖ, ఎలియా కనాల్స్, నీరజ్ చౌహాన్ పోటీపడ్డారు. టోర్నమెంట్ ఉత్తమ ఆర్చర్లుగా రికర్వ్ మహిళల విభాగంలో సంగీత(రాజ్‌పుతానా రాయల్స్), కాంపౌండ్ పురుషుల్లో మథియాస్ ఫుల్లర్టన్(చేరో), కాంపౌండ్ మహిళల్లో అలెజాండ్రా ఉస్కియానో(చోళ) ఎంపికయ్యారు.

# విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు జిల్లా పోలీస్ యంత్రాంగం తరఫున ఘన నివాళి

**- పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం**

**- పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి**

**- జిల్లా ఎస్పీ నితికా పంత్,**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21:( విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, పాల్గొన్నారు.పోలీస్ గౌరవ వందనం అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు, అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు" శోక్ శ్రస్త్" నిర్వహించి, మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బందిఅమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 154 మంది పోలీస్ అమరవీరుల పేర్లను డీఎస్పీ అశోక్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ,పోలీసు విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని అన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ రక్షణ,శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలుస్ఫూర్తిదాయకమని,వారి సేవలను సమాజం ఎప్పటికీ మరువదని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో 1985 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 14 మంది పోలీసులు సమాజం కోసం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. అమరవీరుల సేవలను మరోసారిస్మరించుకోవడంతో పాటు,వారి త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పోలీసు సిబ్బంది పండుగలు,సెలవులకు అతీతంగా విధులు నిర్వహిస్తూ,కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తారని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ,పోలీస్ శాఖకు,రాష్ట్ర ప్రభుత్వానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని పోలీసు అధికారులు,సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు.అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

***అక్టోబర్ 22 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ పోటీలు***

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 22 నుంచి జిల్లాలో ఫొటోగ్రఫీ,షార్ట్ ఫిల్మ్, వీడియోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ తెలిపారు. అలాగే విద్యార్థులకు & పోలీస్ అధికారులకు& సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు,ఫొటోగ్రఫీ, వీడియో రంగంపై ఆసక్తి ఉన్నవారు ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బి.అశోక్,వాహిదుద్దిన్, సీఐలు,ఆర్ఐలు,ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా ఘనంగా స్మృతి పరేడ్

**- అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అమరవీరులకు ఘన నివాళులు**

**- జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు**



గద్వాల అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. ప్రజల భద్రత, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు, విధి నిర్వహణలో ప్రదర్శించే ధైర్యసాహసాలు, అంకితభావం దేశ ప్రజలకు భరోసానిస్తాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణకు అంకితమైన అమరవీరుల త్యాగాలు పోలీస్ శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. అనంతరం జిల్లా అదనపు ఎస్పీ శ్రీ కె. శంకర్ ఈ ఏడాది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వివిధ రాష్ట్రాలకు చెందిన 154 మంది పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. దేశ ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, వారి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఈ సంస్మరణ దినం సందేశాన్నిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల డీఎస్పీ మొగిలయ్య, సాయుధ దళాల డీఎస్పీ నరేందర్ రావు, అలంపూర్, గద్వాల్, శాంతినగర్ సీఐలు ప్రదీప్, శ్రీనివాస్, శంకర్, ఆర్ఐలు నరేష్, వెంకటేష్, హరీఫ్, ఆర్ ఎస్సైలు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, వివిధ విభాగాల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# "ప్రాణం పోయినా.. ప్రజా రక్షణే ప్రథమం!"

**- "అమరుల త్యాగం చిరస్మరణీయం.. పోలీసుల సేవలు అభినందనీయం!"**

**- పోలీస్ అమరవీరులకు ఎస్పీ రోహిత్ రాజు ఘన నివాళి**





కొత్తగూడెం బ్యూరో అక్టోబర్ 22(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు 'శోక్ శస్త్ర' నిర్వహించి అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వీరమరణం పొందిన పోలీసుల త్యాగాలను స్మరించుకున్నారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల పేర్లను ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ చదివి వినిపించారు.

***అమరవీరుల సేవలు చిరస్మరణీయం***

ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించి ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. అమరవీరుల త్యాగాలు పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతి అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైన్యంతో జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీస్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా 1962 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎస్పీ తెలిపారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీస్ సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు.

***దేశ భద్రతలో పోలీసుల పాత్ర కీలకం***

దేశ భద్రత, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఎస్పీ అన్నారు. ఉగ్రవాదం, నక్సలిజం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించేలా చేయడానికి పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి అధికారి, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యా నాయక్‌తో పాటు జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో ఘనంగా దసరా ఉత్సవాలు

**- ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ**



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 21 (విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ స్టేడియంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ హాజరయ్యారు. స్టేడియం జనంతో కిక్కిరిసిపోయింది. లేజర్ కిరణాలతో, టపాకాయల చప్పులతో సభికులు సంతోషించారు.

# రూ.1లక్షల 50 వేలు ఎల్ఓసి. లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



గద్వాల అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ధరూర్ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన వెంకటప్ప తండ్రి ఆశప్ప కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 1లక్షల 50 వేలు రూపాయలు ఎల్ఓసి.లెటర్ ను గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**- అమరుల త్యాగాలు, ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**- పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) : విధి నిర్వహణలో, దేశ అంతర్గత భద్రతతో పాటు ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ , అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్యతో పాటు పోలీసు అధికారులు, అమరుల కుటుంబ సభ్యులు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ప్రజల రక్షణ, దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో పోలీసు వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించి పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని పేర్కొన్నారు.

ప్రపంచమంతా నిద్రిస్తున్న వేళ పోలీసులు మేల్కొని ప్రజల భద్రత కోసం నిరంతరం కాపలా కాస్తారని, ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాల్సిన పండుగలు, ప్రత్యేక సందర్భాలను సైతం త్యజించి ప్రజల రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తారని చెప్పారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి వీరమరణం పొందిన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం, వారికి గౌరవం చూపించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో దేశ సరిహద్దుల రక్షణ విధుల్లో ఉన్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు చైనా సైనికులతో పోరాడుతూ ప్రాణాలర్పించిన ఘటనను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు యోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే సమాజంలో శాంతి, స్థిరత్వం నెలకొని అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరుతాయని ఎస్పీ అన్నారు. భౌతిక భద్రత కల్పించడం నుంచి సామాజిక రుగ్మతలను అరికట్టడం వరకు పోలీసులు కార్యదీక్షతో, సేవాభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రశాంత జీవనానికి తమ జీవితాలను అంకితం చేసిన అమరవీరుల త్యాగాలకు వెలకట్టలేమని పేర్కొన్నారు.

ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తులతో జరిగిన పోరాటాల్లో 154 మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. నారాయణపేట జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో భాగంగా 2005లో కానిస్టేబుల్ రాజారెడ్డి వీరమరణం పొందారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీసుల త్యాగనిరతిని నిరంతరం స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అక్టోబర్ 21 నుంచి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవమైన అక్టోబర్ 31 వరకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు, అక్కడి నుంచి తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "జోహార్ పోలీసు అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేస్తూ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, పరేడ్ కమాండర్ ఆర్ఐ విజయ్ భాస్కర్, సీఐలు రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరేష్, పురుషోత్తం, బాలరాజు, రాజు, రమేష్, సునీత, అశోక్ బాబు, ఆర్ఎస్ఐలు శివశంకర్, శిరీషతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






# కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ ఢీ

- పల్లెల నుండి పట్టణం దాకా పాకిన ఘర్షణ
- మంచిర్యాల బైపాస్ రోడ్డులో పోలీసుల భారీ బందోబస్తు
- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్సెస్ జగన్మోహన్ రావు
- కాంగ్రెస్ వర్గ పోరుతో బంబేలు ఎత్తుతున్న జనాలు

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర) మంచిర్యాల లో కాంగ్రెస్ నేతల మధ్య వర్గ పోరు కాస్త ఉద్రిక్తతకు దారితీస్తోంది ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్సెస్ మంతిని జగన్ మోహన్ రావు మధ్య పోరు దాడుల దాకా వెళ్లడం మళ్ళీ దాడులు జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు రంగంలోకి దిగారు మంచిర్యాల్ బైపాస్ రోడ్డు పై పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు సద్దుల బతుకమ్మ రోజు దండేపల్లి మండలం తాళ్ల పేటలో చోటు చేసుకున్న వివాదం మరవకముందే దసరా రోజున మరో గొడవతో మంచిర్యాల నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది ఈ ఘటనకు సంబంధించిన మంత్రి వివేక్ వర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీస్ కేసులు నమోదు చేసినట్లు సమాచారం వరుసల దాడుల నేపథ్యంలో పోలీసులు పరిస్థితి ని సమీక్షిస్తున్నారు. కాంగ్రెస్ నేత జగన్ మోహన్ రావు ఇంటిపై ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్గీయులు దాడి చేసే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జగన్ మోహన్ రావు నివాసం వద్ద భారీ పోలీసులు మోహరించారు నేతల మధ్య వర్గ పోరు కాస్త దాడుల వరకు వెళ్లడంతో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది దండపల్లి మండలం తాళ్లపేటలో సైతం కఠిన పోలీసులు ఆంక్షలు కొనసాగుతున్నాయి మంత్రి వివేక వర్గానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ ఇంట్లో కుటుంబ సభ్యులతో పాటు గ్రామ గిరిజన మహిళ సర్పంచ్ కళావతి ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి మాల మహానాడు నాయకులు మాడ దయాకర్ ను గత రాత్రి నుండి పోలీసులు గత అరెస్ట్ చేశారు. గత కొన్ని నెలలుగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్గం జగన్ మోహన్ రావు వర్గం పరస్పర దాడులతో జనాలు బమ్మెలెత్తుతున్నారు బంబేలు ఎత్తుతున్నారు ఒకే కుంపటి కింద ఉన్న కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలిపోయి రోడ్డున పడ్డాయని విమర్శలు వినిపిస్తున్నాయి దీనికి దీనికి అధిష్టానం చొరవ చేసుకొని వర్గ పోరు సమసి పోయేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుతున్నారు ఏది ఏమైనా ఈ వర్గపో రుతో మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ చిక్కుల్లో పడ్డట్టు అయింది.

# తొర్రూర్ లో మద్యం వ్యాపారుల మాయాజాలం!

- 6 గంటలకే మూసివేసిన వైన్ షాపులు
- రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచాలన్న నిబంధనకు నీళ్లు
- బెల్టు షాపులకు తరలిన మద్యం
- అధిక ధరలతో మద్యం విక్రయాలు
- అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న మద్యం ప్రియులు
- దసరా మత్తులో ఆబ్కారి అధికారులు
- ఫిర్యాదులకు స్పందించని సీఐ
- బెల్టు దుకాణాల్లో కల్తీ మద్యం విక్రయాలు
- ప్రజల ప్రాణాలను హరిస్తున్న పట్టింపు లేని వైనం






మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర ) : తొర్రూర్ డివిజన్ దసరా పండుగ ను ఉత్సాహంగా జరుపుకుందామని భావించిన సామాన్యులకు మద్యం వ్యాపారులు షాక్ ఇచ్చారు. రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచాల్సిన మద్యం దుకాణాలను 6 గంటలకే కట్టేసి చీకటి వ్యాపారానికి తెర తీశారు. మద్యాన్ని ప్రజలకు విక్రయిస్తే తక్కువ లాభం వస్తుందని భావించిన వ్యాపారులు సాయంత్రం 6 గంటలకు మూసివేసి బెల్టు షాపులకు మధ్యాన్ని అప్పగించారు. దీంతో సామాన్యులు బెల్టు షాపుల్లో అధిక ధరలకు మద్యం కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. పండుగ పూట వచ్చిన కొత్త అల్లుడు, బంధువులకు మర్యాద చేసేందుకు చేతులు కాల్చుకుంటున్నారు. వైన్స్ లో బీరుకు లైట్ కు రూ. 180, స్ట్రాంగ్ కు రూ. 190 ఉండగా బెల్టు షాపుల్లో రూ. 230 తీసుకుంటున్నారు. మద్యానికి రూ. 50 నుంచి రూ. 70 వరకు అదనపు వసూళ్లు చేపడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అది అంతే అని సమాధానం ఇస్తున్నారు. మద్యం దుకాణాలు సాయంత్రం 6 గంటలకే మూసివేసినా ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడిన మద్యం వ్యాపారులు దసరా పేరుతో అందిన కాడికి దోచుకుంటున్నారు. బెల్టు షాపులకు కల్తీ చేసిన మద్యం పంపిణీ చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్తీ మద్యంతో మద్యం ప్రియులు ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నా పట్టించుకోకుండా వ్యాపారులు కాసులు పోగేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు మద్య వ్యాపారులు మంగళం పాడుతున్నా ఎక్సైజ్ అధికారులు స్పందించడం లేదు. ప్రజల సొమ్ము కాజేస్తున్న మద్యం వ్యాపారుల తీరుపై పౌర సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

## నాగర్ కర్నూల్ లో దసరా వేడుకల్లో ఆసక్తికర ఘటన వేదికపైనే ఆలింగనం చేసుకున్న మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేలు

ఎప్పుడూ రాజకీయంగా ఢీ అంటే ఢీ అనుకునే నేతలు దసరా శుభాకాంక్షలతో ఒక్కటైన వేళ

తెలంగాణ స్టేట్ బ్యూరో, నాగర్ కర్నూల్, అక్టోబర్ 21, (విజన్ ఆంధ్ర): నాగర్ కర్నూల్ జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. దసరా ఉత్సవాల సందర్భంగా నాగర్ కర్నూల్ లోని మినీ ట్యాంక్ బండ్ పై జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్ రెడ్డి ఒకరికొకరు ఎదురుపడ్డారు. ఎప్పుడూ రాజకీయ వేదికలపై ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ, ద్వేషంతో ఉంటారని ప్రచారంలో ఉన్న ఈ ఇద్దరు నేతలు, దసరా వేడుకల్లో మాత్రం ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు చెప్పుకుని ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలు, కార్యకర్తలు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు.



***రాజకీయాలు వేరు వ్యక్తిగత సంబంధాలు వేరు:***

ఈ ఘటనతో ఒక మంచి సందేశం వెళ్లిందని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు, వేదికలపై విమర్శలు చేసుకోవచ్చు, కానీ వ్యక్తిగతంగా కలిసినప్పుడు ఆత్మీయంగా ఉండాలని, ద్వేషాలు పెంచుకోవద్దని ఈ ఇద్దరు నేతల ఆలింగనం చెబుతోందని అంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు, నాయకులు ఈ ఘటనను చూసి నేర్చుకోవాలని, నాయకులే ఇలా కలిసిపోతుంటే కింది స్థాయి కార్యకర్తలు అనవసరంగా ఆవేశాలు పెంచుకుని ఒకరిపై ఒకరు కోపాలు, ద్వేషాలు పెంచుకోవద్దని సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. రాజకీయం కేవలం ప్రజా సేవ కోసమే, వ్యక్తిగత ద్వేషాల కోసం కాదని, పండుగ వేళ ఇద్దరు నేతలు ఇచ్చిన ఈ ఆత్మీయ సందేశం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# దసరా వేళ ప్రత్యక్షమైన నారీశక్తి!!

- వీరనారిగా మెరిసిన కందుల సంధ్యారాణి
- జై హనుమాన్ అకాడా విన్యాసాలకు జనం ఫిదా
- చేతిలో కర్ర.. హృదయంలో ధైర్యం





పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 21 (విజన్ ఆంధ్ర): గోదావరిఖని దసరా వేడుకలు ఈసారి కేవలం సంప్రదాయ ప్రదర్శనలకు మాత్రమే పరిమితం కాలేదు. శక్తి ఆరాధనకు ప్రతీకగా జరుపుకునే విజయదశమి రోజున, మహిళా శక్తి ప్రత్యక్ష రూపంగా ఆవిష్కృతమై అందరినీ ఆకట్టుకుంది. ఆ శక్తికి ప్రతిరూపంగా నిలిచింది బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి. ప్రధాన చౌరస్తా నుంచి రామాలయం వరకు సాగిన జై హనుమాన్ అకాడా విన్యాసాలు ఎప్పటిలాగే ఆకట్టుకున్నప్పటికీ, ఈ ఏడాది అందరి దృష్టిని ఒక సందర్భం ప్రత్యేకంగా కట్టిపడేసింది. వేదికపై అతిథి కాదు... మైదానంలో యోధురాలు! చాలా మంది నాయకులు సభలకు వచ్చి ప్రసంగించి వెళ్లిపోతారు. కానీ సంధ్యారాణి మాత్రం భిన్నంగా నిలిచారు. అకాడా యువకుల విన్యాసాలు వీక్షించిన ఆమె, నేరుగా మైదానంలోకి దిగి చేతిలో కర్ర పట్టారు. అనంతరం కర్రసాము విన్యాసాలు చేస్తూ మహిళలు ఏ రంగంలోనైనా వెనుకబడి లేరని చాటిచెప్పారు. ఒక మహిళా నాయకురాలు ఇంత ధైర్యంగా, అంతే లాఘవంగా సంప్రదాయ క్రీడలో పాల్గొనడం చూసిన ప్రజలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. దసరా వేడుకల్లో మహిళా శక్తి సత్తా చాటిన ఘట్టంగా ఇది నిలిచిపోయింది

***గాల్లో కర్రలు... నోట జై హనుమాన్ నినాదాలు!***

జై హనుమాన్ అకాడా విద్యార్థులు ప్రదర్శించిన కర్రసాము, లాఠీ విన్యాసాలు, సాహస ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. గాల్లో చక్రంలా తిరిగిన కర్రలు, మెరుపు వేగంతో సాగిన విన్యాసాలు చూస్తూ జనం మైమరచిపోయారు. ప్రతి విన్యాసం పూర్తయినప్పుడల్లా చప్పట్ల శబ్దం, "జై హనుమాన్" నినాదాలు మార్మోగాయి.

***మహిళలు ముందుకొస్తే సంప్రదాయం మరింత బలపడుతుంది!***

ఈ దసరా వేడుక ఒక విషయాన్ని స్పష్టంగా చాటిచెప్పింది. సంప్రదాయ క్రీడలు పురుషులకే పరిమితం కావు. మహిళలు కూడా ముందుకు వస్తే సంస్కృతి మరింత బలపడుతుంది. గోదావరిఖని వీధుల్లో జై హనుమాన్ అకాడా విన్యాసాలు ఎంతటి ఆకర్షణగా నిలిచాయో, "మహిళా విన్యాసం"తో సంధ్యారాణి చూపించిన ధైర్యం అంతకంటే పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# అంగరంగ వైభవంగా దసరా సంబరాలు

*నాగర్ కర్నూల్ మినీ ట్యాంక్ బండ్, కల్వకుర్తి బీఎస్ఎన్ఎల్ మైదానంలో లైటింగ్ ట్రస్ తో ప్రత్యేక ఉత్సవాలు కన్నుల పండుగగా వేడుకలు*








తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర): నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా దసరా పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. జిల్లాలోని రెండు ప్రధాన పట్టణాలైన నాగర్ కర్నూల్, కల్వకుర్తిలో దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. నాగర్ కర్నూల్ లోని మినీ ట్యాంక్ బండ్ పై, అలాగే కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ మైదానంలో లైటింగ్ తో కూడిన భారీ ట్రస్ ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ కళాకారులచే నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు అంబరాన్ని అంటాయి.

**నాగర్ కర్నూల్ మినీ ట్యాంక్ బండ్ పై ఆసక్తికర దృశ్యం:**

నాగర్ కర్నూల్ మినీ ట్యాంక్ బండ్ పై జరిగిన దసరా వేడుకల్లో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఇద్దరూ పాల్గొన్నారు. ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకుని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి వేడుకల్లో పాల్గొన్న ప్రజలతో కలిసి డాన్సులు చేస్తూ సందడి చేశారు.

**కల్వకుర్తిలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా:**

కల్వకుర్తి పట్టణంలో దసరా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన సంబరాలు అంబరాన్ని అంటాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. శమీ పూజ, జమ్మి పూజలు నిర్వహించారు.

**కల్వకుర్తి వేడుకల్లో సీఎం సందడి ఘన స్వాగతం:**

ముఖ్యంగా కల్వకుర్తి దసరా ఉత్సవాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన సొంత గ్రామం కొండారెడ్డిపల్లి నుంచి విచ్చేయడం విశేషం. సీఎంకు స్థానికంగా మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. మాజీ మున్సిపల్ చైర్మన్లు శ్రీశైలం, ఎడమ సత్యం కూడా సీఎంను కలవడం జరిగింది. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతి ఒక్కరూ సీఎంతో ఫోటోలు దిగారు. ఆ వేదికపై నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఎం చేతుల మీదుగా రావణ దహన కార్యక్రమం ఘనంగా జరిగింది. దీంతో కల్వకుర్తి దసరా ఉత్సవాలు మరింత వైభవంగా మారాయి. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పట్టణ తాజా,మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు..

## గౌలీపుర బతుకమ్మ బావి వద్ద ఘనంగా బతుకమ్మ, రావణ దహన వేడుకలు

***ఆరు ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రదానం***





గౌలిపుర హైదరాబాద్ అక్టోబర్ 21 విజన్ ఆంధ్ర ప్రతినిధి : గౌలీపుర బతుకమ్మ బావి వద్ద చారిత్రక శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం సమీపంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బతుకమ్మ, రావణ దహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చి, పూజలు నిర్వహించిన అనంతరం సుందరంగా అలంకరించిన రథంపై ప్రతిష్ఠించారు. అక్కడి నుంచి అఖండ వ్యాయామశాల పక్కన ఉన్న మైదానానికి తీసుకెళ్లి రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక ఏసీపీ సీహెచ్. చంద్రశేఖర్, ఛత్రినాక సీఐ ఎస్. కోటేశ్వర్ రావు, పి. గోపాల్ రావు, ఎస్ఐ హసీనా బేగం తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ శేషాద్రి అయ్యంగార్, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.పి. క్రాంతి కుమార్, రాహుల్ మానే, రవి యాదవ్, సుందర్ అయ్యంగార్, అంబాదాస్, ఆదిత్య, కోటేశ్, మాణిక్ ప్రభు, అనుపమ్ సాయి, రాకేష్ తదితరులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందంగా అలంకరించిన బతుకమ్మల్లో ఉత్తమంగా నిలిచిన ఆరు బతుకమ్మలకు కమిటీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.






## మంత్రి శ్రీధర్‌బాబుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

బోడుప్పల్,అక్టోబర్ 21(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, విజయదశమి పర్వదినం రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు.ఐఈ మర్యాదపూర్వక భేటీ పండుగ వాతావరణంలో ఆత్మీయంగా సాగింది.ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల దీలిప్ రెడ్డి,ఉపాధ్యక్షుడు రాపోలు ఉపేందర్,బోడుప్పల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పక్కీర్ హరినాథ్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.